
మార్చి 2026
రు. 20/-
సంకల్ప బలం
పరాభవ
నామ సంవత్సర
ఉగాది శుభాకాంక్షలు


ఇరాన్ x అమెరికా


దుబాయి పై దాడి చేసిన ఇరాన్




# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

వ్యవస్థాపక సంపాదకురాలు

తీగవరపు శాంతి

మార్చి 2026

సంపుటి -15 సంచిక - 6


## ఈ సంచికలో....


సంపాదకీయం 4

వార్తా విశేషాలు 7

కాశీ మజిలీ కథలు 34

యక్షప్రశ్నలు -భావోద్వేగాల నియంత్రణ 36

బ్రహ్మ ఖండం 38

కలియుగ ప్రత్యక్ష దైవం 40

“పుష్పాద్రి” శ్రీ లక్ష్మీనరసింహస్వామి 41

సాధనాలు - ఆశయాలు 44

అక్షర చరణిలు 46

ఓ మహిళా! నీకు జేజేలు 50



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

చైతన్యం సంకల్పబలం ప్రేక్షకులకు శ్రీ పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు

2026 మార్చి 19, గురువారం, చైత్ర శుద్ధ పాడ్యమి నాడు పరాభవ నామ సంవత్సరం ప్రారంభమవుతుంది. మన తెలుగు క్యాలెండర్ లోని 60 సంవత్సరాల చక్రంలో 40 వ సంవత్సరం. పరాభవ అంటే 'ఓటమి' లేదా 'పరాజయం' అనే అర్థం వచ్చినప్పటికి జ్యోతిష శాస్త్రం ప్రకారం పరాభవ అంటే శత్రువులను లేదా అహంకారాన్ని జయించి, వినయాన్ని పెంపొందించుకోవాల్సిన సంవత్సరాన్ని సూచిస్తుంది. ఈ సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ మార్పులు, కొన్ని సవాళ్లు లేదా అపజయాలు ఎదురయ్యే అవకాశం ఉందని జ్యోతిష్య పండితులు అంచనా వేస్తున్నారు. కొన్ని జ్యోతిష గ్రంధాలలో ఈ సంవత్సరం ప్రజలు ఒకరినొకరు అవమానించుకోవడం, ఓటములు ఎదుర్కోవడం, ధన నష్టం, నైతిక పరాభవాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఉగాది ఆచారం ప్రకారం షడ్రుచుల ఉగాది పచ్చడిని తీసుకోవడం, పంచాంగ శ్రవణం చేయడం మన ఆనవాయితీ. షడ్రుచుల లాగే జీవితం అంటే సుఖాలే కాదు... దుఃఖాలు, సవాళ్లు కూడా ఉంటాయని గుర్తు చేసేందుకే ఈ సంవత్సరాలు అని కూడా చెబుతారు. అందుకే అహం కారం ఉన్న వారికి ఓటమి తప్పదు .. వినయంగా ఉంటే మీ జీవితంలో మీరే ఊహించనంత అద్భుతమైన మార్పులు వస్తాయి. కేవలం సంవత్సరం పేరు వల్లే ఫలితాలు ఆధారపడి ఉండవు. ఇది ఒక సూచన మాత్రమే. కర్మ, ప్రయత్నం, భక్తి ఆధారంగా ఫలితాలు మారుతాయి. ఉగాది పచ్చడిలో ఉండే అన్ని రుచులు జీవితంలో ఉంటాయనే సూచన.

మహిళాదినోత్సవ శుభాకాంక్షలు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. మహిళలంతా సమానత్వాన్ని పొందుతూ, తమ జీవితాన్ని జన్మను సార్థకం చేసుకోవాలి. అదే నిజం, అదే న్యాయం మగవారి దగ్గర అణిగి మణిగి తమ జీవితాలను పణంగా పెట్టవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. బయట ప్రపంచంలోకి అడుగు పెట్టిన స్త్రీ, సమాజంలో తన ప్రతిభా పాటవాలతో ముందుకు దూసుకెళ్లాలి. దూసుకువెళుతోంది కూడా. కానీ ఇంకా స్త్రీ ముందుకు వెళ్ళడానికి ప్రోత్సాహం అటుంచి ఆటంకాలే ఎదురవుతున్నాయి అనడంలో ఎంత మాత్రం సందేహం లేదు. స్త్రీకి స్త్రీయే శత్రువు అన్నట్లు స్త్రీ సమాజంలో పొందే కీర్తి ప్రతిష్టల పేరుతొ స్త్రీని ఏ రంగంలోనూ ముందుకు వెళ్లకుండా వెనక్కి లాగేస్తున్నారు. సమాజ శ్రేయాస్సును దృష్టిలో పెట్టుకుని సమాజానికి పనికి వచ్చే ఏ పని చేయడానికైనా స్త్రీ వెనకడుగు వేయకూడదు . అటువంటి స్త్రీని అందరూ కుల మత, ఆర్థిక రాజకీయ లింగ , వయస్సు బేధ భావం లేకుండా అందరినీ ప్రోత్సహించాలి . అలా ముందుకు దూసుకు వెడుతున్న స్త్రీలను ముఖ్యంగా కుటుంబాలు, అందులోను భర్త ప్రోత్సాహాన్ని అందివ్వాలి. ప్రోత్సాహం అంటే చెయ్యమని అన్ని పనులు నెత్తి మీద వదిలేయడం కాదు, ఆర్థికంగా, శారీరకంగా అన్నిటిలోను తోడునీడగా నిలబడి ప్రోత్సాహాన్ని అందివ్వాలి. అటు వంటి స్త్రీలకు ప్రభుత్వం కూడా సహకారాన్ని అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

స్త్రీ సహజంగా చాలా తెలివైనది. కానీ ఇంతవరకు స్త్రీ తెలివి తేటలు మగవారు తమ అహంకారంతో అణచివేశారు. అమెరికా లాంటి ప్రదేశాలలో బస్సు డ్రైవర్లు ఎక్కువగా ఆడవారే కనిపిస్తారు. అన్ని రంగాలలోను స్త్రీ ముందుంటుంది. మన దేశంలో కూడా అన్ని రంగాలలోను స్త్రీలు ముందుంటున్నారు. అయితే దురదృష్టవ శాత్తు స్త్రీలలో అహంకారం ఎక్కువై, సంసారాలు కూలదోసుకునేంత వరకు

వెడుతున్నారు. స్త్రీ జ్ఞాన సంపద కుటుంబాలకే కాదు, ప్రపంచానికి కూడా ఉపయోగపడేలా ఉండాలి.

పాఠక దేవుళ్ళకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు

2026 లో మార్చి 27వ తేదీ శుక్రవారం చైత్ర శుద్ధ నవమి నాడు శ్రీరామ నవమి పండుగ జరుపుకోనున్నాం. రాముని జన్మదినాన్ని పురస్కరించుకుని, సీతారాముల కళ్యాణోత్సవం, శోభాయాత్ర వైభవంగా నిర్వహిస్తారు. ఈ పండుగ భక్తి, ధర్మం, మరియు ఆదర్శ జీవితాన్ని గుర్తు చేస్తుంది. రాముడు విష్ణువు యొక్క 7వ అవతారం గా పరిగణించబడతారు. రాముడిని ఆదర్శ రాజుగా, ధర్మానికి ప్రతి రూపంలో కొలుస్తారు. అందుకే ధర్మంగా ఉన్నవారిని ధర్మ ప్రభువు రాముడని, ఏదైనా రాజ్యం లోని పరిపాలన ధర్మంగా ఉంటే రామ రాజ్యం అని అనుకుంటూ ఉంటాము.

మూసీ పునరుజ్జీవంతో హైదరాబాద్ ను మురిపిద్దాం -- రేవంత్ రెడ్డి

ప్రపంచంలోని అనేక నగరాలు ఆయా దేశాలకే తలమానికంగా ఉంటూ..అభివృద్ధి పథంలో నడుస్తుంటే, మనం వెనకబడితే భవిష్యత్తు తరం క్షమించదని, మూసీ పునరుజ్జీవం తో హైదరాబాద్ నగరం అద్భుతంగా తయారవుతుందని, ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పేదలకు ఎటువంటి పరిస్థితుల్లోనూ నష్టం కలగనివ్వ బోమని, తమ ప్రభుత్వం పేదల కోసమే ఉందని అన్నారు. దేవతలు యజ్ఞం చేస్తుంటే, రాక్షసులు భగ్నం చేసే ప్రయత్నం చేసినట్లు, అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఇది ఎవరి ఆస్తులు గుంజుకోవడం కాదని స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టుకు తాము ఎప్పుడూ వ్యతిరేకం కాదని, పేదల ఇల్లు ముట్టకుండా మూసీ ప్రక్షాళన చెయ్యాలని భాజపా అధ్యక్షుడు రామచంద్ర రావు అన్నారు.

అనవసర ఆందోళనతో గ్యాస్ బుక్ చేయవద్దు --- ప్రజలకు కేంద్ర విజ్ఞప్తి

పశ్చిమాసియా ఘర్షణలతో ఇంధన భయాలు నెలకొన్న వేళ.. దేశంలో ఎల్పీజీ కొరత లేదని కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తి 30 శాతం పెరిగిందని పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ శుక్రవారం వెల్లడించారు.

రాష్ట్రంలో 15 శాతం హోటళ్లు మూత- బ్లాక్ మార్కెట్లో వాణిజ్య సిలిండర్ రూ 6 వేలకు విక్రయం

వాణిజ్య సిలిండర్ల కొరతతో రాష్ట్రంలో 15 శాతం హోటళ్లు మూతపడ్డాయని, రాష్ట్ర హోటల్ యజమానుల సంఘం తెలిపింది. సంఘం నిర్వాహకులు మాట్లాడుతూ ... వాణిజ్య వినియోగానికి సిలిండర్ కొరత కారణంగా చెన్నైలో 215 చిన్న, మధ్యతరహా హోటళ్లను మూసి వేశారన్నారు. పెద్ద స్థాయి హోటళ్లు కట్టెల పొయ్యి, ఎలక్ట్రిక్ స్టౌలకు మారాయని తెలిపారు. 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర చెన్నై లో రూ 2,043 గా ఉండేది. ఇది ప్రస్తుతం రూ 6,500 వరకు బ్లాక్ మార్కెట్ లో విక్రయిస్తున్నారు.

ఏఐ వాటిని రీప్లేస్ చేయలేదు .. సుప్రీంకోర్టు జడ్జ్

ఏఐ వినియోగంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. న్యాయవాదుల పనిని సులభతరం చేయడానికి, సమయాన్ని ఆదా చేయడానికి ఏఐ ఉపయోగపడుతుందన్నారు. అంతేకాని న్యాయవాది శిక్షణ పొందిన మనస్సును, కోర్టు అధికారి నైతిక బాధ్యత ను, జడ్జికి అవసరమైన క్రమశిక్షణ తీర్పును రీప్లేస్ చేయలేదని పేర్కొన్నారు. డ్రాఫ్ట్ నాట్ లను తయారు చేయడానికి టెక్నాలజీ ఉపయోగించవచ్చని, అయితే చట్టాలను రూపొందించడానికి అనుమతించలేమని తెలిపారు.

## యుద్ధం వేళ ప్రజల్లో భయం పుట్టిస్తున్నారు -- కాంగ్రెస్ పై మోదీ ధ్వజం

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మోదీ అస్సాంలోని సిల్చార్ బహిరంగ సభలో మాట్లాడుతూ, ఆయన విపక్షాలపై మండిపడ్డారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో భయాందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. యుద్ధం నేపథ్యంలో దేశపౌరులపై ప్రభావం పడకుండా ఉండేందుకు మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇలాంటి కీలక సమయంలో కాంగ్రెస్ బాధ్యతా యుతంగా ప్రవర్తిస్తుందని భావించాం కానీ జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన విషయంలో అది మరోసారి విఫలమైందని అన్నారు.

## దీర్ఘ కాలిక యుద్ధం ఉచ్చులో అమెరికా - ఇరు పక్షాలతో పాటూ ప్రపంచ దేశాలూ భారీ మూల్యం

అమెరికా --ఇజ్రాయెల్ సంయుక్త దాడులు... దానికి ఇరాన్ చేస్తోంది. ప్రతి దాడులు ప్రస్తుత యుద్ధాన్ని రోజు రోజుకీ మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. ఈ యుద్ధం వలన ఇరు పక్షాలతో పాటు ప్రపంచ దేశాలన్నీ భారీ మూల్యాన్నే చెల్లిస్తున్నాయి. తొలిరోజు దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ, ఆ దేశ ముఖ్య సైనికాధికారులు చనిపోవడంతో భారీ విజయం సాధించామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతాన్యాహు ప్రకటించారు. సైనిక పరమైన ఈ విజయం రాజకీయ వ్యూహాత్మక గెలుపునకు దారి తీయకపోగా దీర్ఘకాల యుద్ధంలో ఆ దేశాలు కూరుకుపోయేలా చేస్తోందని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ట్రంప్ తొలి రోజు విజయంతో, ఇరాన్ లో ప్రభుత్వ మార్పుఈ లక్ష్యాన్ని చేరుకోవడం ఎంతో సమయం పట్టదని అంచనా వేశారు. కానీ నెతాన్యాహు, ట్రంప్ ఆశించినట్లు టెహ్రాన్ లో మాతా గురువుల పాలన ఇప్పటికిప్పుడు ముగిసిపోయే సూచనలు కనిపించడం లేదు. ఈ యుద్ధం చమురు చుట్టునేతిరుగుతోంది. ఇరాన్ చమురు బలాన్ని అడ్డుకుంటే, ఆ దేశం దిగి వస్తుందనేది అమెరికా వ్యూహం. అదే చమురు రవాణాను పూర్తిగా అడ్డుకుంటే, ప్రపంచంపై ఒత్తిడి పెరిగి అగ్రరాజ్యం యుద్ధానికి ముగింపు పలుకుతుందని ఇరాన్ అనుకుంటోంది. ఖర్గ్ .. ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఈ ద్వీపంలో సైనిక స్థావరాలను ధ్వంసం చేశామని ట్రంప్ ప్రకటించారు. హర్మూజ్ లో నౌకలను అడ్డుకుంటే చమురు క్షేత్రాలపైనా దాడులు చేస్తామని స్పష్టం చేశారు. అమెరికా దాడులవల ఇప్పటిదాకా 15,000 లక్ష్యాలపై దాడులు చేశామని, రోజుకు 1,000 కి పైగా లక్ష్యాలపై బాంబులు వేశామని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హేగ్సేత్ తెలిపారు. ఈ దాడుల్లో 52 సాంస్కృతిక కేంద్రాలు ధ్వంసమయ్యాయని ఇరాన్ వెల్లడించింది.

ఇరాన్ చర్చలను కోరుకుంటోందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, అవసరమైతే ఇంకో ఐదేళ్లు యుద్ధాన్ని కొనసాగించే సత్తా తమకు ఉందని ఇరాన్ తెలిపింది.ఈ ఇరు దేశాల యుద్ధ ప్రభావం, ప్రపంచ దేశాల మీద పడింది. ప్రజలు అనేక ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రజలు కూడా ఇటువంటి సమయంలో ప్రభుత్వానికి అండగా నిలబడవలసి అవసరం ఎంతైనా ఉంది. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందా! అని ఎంతో ఆశగా ఎదురు చుస్తునారు ప్రజలంతా. కొత్త సంవత్సరంలో అందరూ సుఖశాంతులతో ఆనందమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటూ...

సర్వేజనా సుఖినోభవంతు.



తీగవరపు శాంతి

# వార్తా విశేషాలు

## తెలంగాణలో రూ.894 కోట్ల విలువైన రబీ పంటలను మద్దతు ధరతో సేకరించనున్న కేంద్రం

ఈ రబీ పంట కాలంలో తెలంగాణలో 894 కోట్ల రూపాయిల విలువైన పంటలను మద్దతు ధరతో కేంద్ర ప్రభుత్వం సేకరించనుంది. ఈ సీజన్ లో లక్షా 25 వేల 855 మెట్రిక్ టన్నుల పంటను సేకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా 29 వేల 860 మెట్రిక్ టన్నుల పప్పు ధాన్యాలు.. 37వేల 20 మెట్రిక్ టన్నుల మినుములు... 55వేల 285 మెట్రిక్ టన్నుల వేరుశనగ... 3వేల 690 మెట్రిక్ టన్నుల పొద్దు తిరుగుడు పువ్వు సేకరిస్తుంది. . తెలంగాణలో శనగలు, మినుములు, వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలను సాగు చేసే రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరుతుంది. ఇది రాష్ట్ర వ్యవసాయ రంగంలో స్థిరత్వం, భద్రత, సమృద్ధికి ఒక కొత్త దిశను నిర్దేశిస్తుంది. రైతుల కష్టానికి తగిన పూర్తి ధర లభించేలా చూడటమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ ఆమోదంతో తెలంగాణ రైతులు పంటకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తికి కొత్త ఊపునిస్తుందని అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి కేంద్రం కృషి చేస్తోందని చెప్పారు

## నారీ శక్తి వందన్ అధినియం ఒక దార్శనిక చట్టం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు

మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి నారీ శక్తి వందన్ అధినియం ఒక దార్శనిక చట్టమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు అన్నారు. చట్టసభలలో మహిళా ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేతి ఎందుకు ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసిందని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా భారతీయ జనతా పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో మల్కాజ్గిరి ఆనంద్ బాగ్ లో ఇంటలెక్చువల్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను సత్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇవాలన్నారు. జుడిష్యరీలో మహిళలకు దక్కాల్సిన ప్రాతినిధ్యం దక్కడం లేదని.. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో అటువైపుగా కృషి చేయాలన్నారు. మహిళలకు ప్రస్తుతం అన్ని విధాలుగా మోడీ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని.. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లు అమలు చేసిందని గుర్తు చేశారు.

# శాతవాహన యూనివర్సిటీలో ఘనంగా అకాడమిక్ ఎంపవర్మెంట్ ప్రోగ్రామ్

ప్రస్తుత రోజుల్లో విద్యతో పాటు వివిధ రకాల నైపుణ్యాలు ఎంతో ముఖ్యమని, అప్పుడే ఉపాధి మార్గాలు లభిస్తాయని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రం లోని శాతవాహన యూనివర్సిటీలో జరిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు "అకాడమిక్ ఎంపవర్మెంట్ ప్రోగ్రాం" కార్యక్రమానికి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేనా, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగితా రాణా మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో మార్కులతో పనిలేదని, మంచి స్కిల్స్ కనబరిచిన వారే రాణించగలరని అన్నారు. రాష్ట్రంలోని ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో "అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్" (ఏ.ఈ.డి.పీ) కోర్సుల ద్వారా విద్యార్థులకు చదువుతోపాటు వృత్తివిద్య, నైపుణ్య రంగాల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గత ఏడాది 1200 మంది ఈ శిక్షణ పూర్తి చేసుకొని, పలు రంగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఈ ఏడాది 8 వేల మంది విద్యార్థులకు ఈ శిక్షణకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 1) యోగితా రాన............... బైట్ ( ముఖ్య కార్యదర్శి, విద్యా శాఖ, తెలంగాణ ) ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేనా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని, విద్యార్థులు పలు రంగాల్లో శక్తి సామర్థ్యాలు చాటేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కళాశాలల నుండి విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను నేర్చుకుని వెళ్లాలని తెలిపారు. ఏ ఈ డి పి ద్వారా శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని కళాశాల విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై నీతి అయోగ్ నివేదిక.. అభివృద్ధి వ్యయం పెరిగినా అప్పుల భారంపై హెచ్చరిక

2023–24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి వ్యయాల పెరుగుదలతో కొనసాగినట్లు రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచిక వెల్లడించింది. సామాజిక సేవలు, ఆర్థిక సేవలకు కేటాయింపులు పెరగడం, ముఖ్యంగా మూలధన వ్యయాలు గణనీయంగా పెరగడంతో మౌలిక సదుపాయాల నిర్మాణం, సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్రం దృష్టి నిలకడగా కొనసాగినట్లు పేర్కొంది. నీతి అయోగ్ విడుదల చేసిన ఈ నివేదికలో రాష్ట్ర ఆదాయాల్లో సొంత పన్ను ఆదాయాలే ప్రధాన భాగం కాగా, పన్నేతర ఆదాయాలు కూడా వేగంగా పెరుగుతున్నట్లు వెల్లడయింది. కాగా... కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్ల వాటా క్రమంగా తగ్గుతున్నట్లు నివేదిక వెల్లడించింది. ఆర్థిక సూచిల పరంగా చూస్తే రాష్ట్రం స్వల్ప రెవెన్యూ మిగులు కొనసాగిస్తూ, దవ్య లోటును చట్టపరమైన పరిమితులలోనే ఉంచినట్లు తెలిపింది. అయితే అభివృద్ధి అవసరాల కారణంగా అప్పులు క్రమంగా పెరిగాయని, ఎఫ్ఆర్‌బీఎం చట్టం సూచించిన పరిమితిని స్వల్పంగా అధిగమించినట్లు కూడా నివేదిక పేర్కొంది. .

## రైతుల ఖాతాల్లోకి పీఎం-కిసాన్ నిధులు.. ఈ-కేవైసీ ఉంటేనే రూ.2,000 జమ

ప్రధానమంత్రి కిసాన్ నిధులు పొందాలంటే ఈ-కేవైసీ పూర్తి చేయాలని రైతులకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. పీఎం-కిసాన్ 22వ విడత నిధులను విడుదల చేయనున్న నేపథ్యంలో ఈ విజ్ఞప్తి చేసింది. రైతులు ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కోరారు. పీఎం కిసాన్ పోర్టల్‌లో ఈ-కేవైసీ ఎంపిక చేసుకుని ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని, ఓటీపీ లేదా బయోమెట్రిక్ ద్వారా దీన్ని పూర్తి చేయొచ్చని తెలిపింది. ఈ రెండూ కాకుండా ఫేషియల్ రికగ్నిషన్ మొబైల్ యాప్‌ను కూడా కేంద్రం అందుబాటులోకి తెచ్చింది. ఇలా ఉండగా, అస్సాంలోని గువాహటిలో రేపు జరగనున్న కార్యక్రమంలో 9 కోట్ల 32 లక్షల మంది పైగా రైతులకు 2వేల రూపాయల చొప్పున పీఎం-కిసాన్ నిధులను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు

## హార్ముజ్ జలసంధి సమీపంలో అమెరికా సైన్యం దాడులు




ఇరాన్ లోని హార్ముజ్ జలసంధి సమీపంలో అమెరికా సైన్యం దాడులు నిర్వహించింది. ఇరాన్‌కు చెందిన 16 మైన్ లేయింగ్ నౌకలను అమెరికా సెంట్రల్ కమాండ్ ధ్వంసం చేసింది. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన ఈ మార్గంలో ఇరాన్ మైన్లను అమర్చుతోందన్న వార్తల నేపథ్యంలో అమెరికా ఈ చర్య తీసుకుంది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటిస్తూ .. .. హార్ముజ్ జలసంధిలో ఇరాన్ ఎక్కడైనా మైన్లను అమర్చి ఉంటే, వాటిని తక్షణమే తొలగించాలని ఇరాన్ ను హెచ్చరించారు. అలా కానీ పక్షంలో .. .. ఊహించని రీతిలో సైనిక పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే 10 ఇన్‌యాక్టివ్ మైన్ లేయింగ్ నౌకలను తమ సైన్యం పూర్తిగా ధ్వంశం చేసిందని ట్రంప్ పేర్కొన్నారు. ...

# పెట్రోల్, డీజిల్ అవసరం లేకుండా ఆక్సిజన్‌తో నడిచే వాహనాల ఇంజన్‌ను ఆవిష్కరించిన సిద్దిపేట జిల్లా విద్యార్థి కౌశిక్

ఆటోమొబైల్ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్న తరుణంలో సిద్దిపేట జిల్లా గౌరారం గ్రామంలోని కావేరి యూనివర్సిటీలో చదువుతున్న కౌశిక్ అనే విద్యార్థి విన్నూత ఆవిష్కరణ చేశాడు. పెట్రోల్ డీజిల్ వంటి ఇంధనాలు అవసరం లేకుండా ఆక్సిజన్ తో నడిచే ఇంజన్ నమూనాను కౌశిక్ రూపొందించాడు. దీనికి జాతీయ, అంతర్జాతీయ పెటెంట్ కూడా కౌశిక్ పొందాడు. దేశంలోనే ప్రధాన నగరాలు కాలుష్యంతో నిండిపోయి ఆక్సిజన్ దొరకక ప్రజలు వ్యాధుల బారిన పడి, ఆక్సిజన్ సిలిండర్లను కొనుక్కొని ఆక్సిజన్ ను పొందుతున్నారు దీనికి ప్రధాన కారణం కాలుష్యంతో నడిచే వాహనాలు. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడం కోసం కౌశిక్ ఏఐ టెక్నాలజీ సహాయంతో ఆక్సిజన్ తో నడిచే ఇంజన్ నమూనాను ఆవిష్కరణ చేశాడు. ఇంజన్ నమూనా సృష్టికర్త కౌశిక్ మాట్లాడుతూ ఆటోమొబైల్ రంగం నుండి 90 శాతం కాలుష్యం జరుగుతుందని దీనికి పరిష్కారంగా ఆక్సిజన్‌తో నడిచే ఇంజన్ ని ఆవిష్కరించినట్లు తెలిపారు. మనిషిలా ఇంజన్ కూడా గాలిని పిలుచుకొని ఆక్సిజన్ తీసుకుంటుందని బైక్, కార్ల వంటి వాహనాలకు ఈ ఇంజన్ ని అమర్చవచ్చని తెలిపారు. ఏఐ టెక్నాలజీ సహాయంతో ఈ ఇంజన్ నమూనాను ఆవిష్కరించానని తెలిపారు. ఏఐ టెక్నాలజీ ఈ ఇంజన్ లో ఎలా పనిచేస్తుందంటే మనం ఎలా అయితే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటామో ఈ ఇంజన్ కూడా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. ఇంజన్ కి ఎంత అయితే అవసరమో అంతే గాలిని తీసుకుంటుందని ఇంజన్ ని ఎలా జనరేటర్ చేసుకోవాలో సాఫ్ట్ వేర్ లో సహజ సిద్ధంగా నిర్మించానని తెలిపారు. యువత వారికి వచ్చే ఆలోచన ప్రకారం శ్రద్ధగా పని చేసుకుంటూ పోతే కచ్చితంగా విజయం సాధిస్తారని ప్రతి ఆలోచనకి పరిష్కారం ఉంటుందని దానిని శ్రద్ధగా చేసుకుంటూ పోతే విజయం వరిస్తుందని ఈ ఇంజన్ లో కూడా నా విషయంలో కూడా అదే జరిగిందని అన్నారు. ఈ ఇంజన్ ఆవిష్కరణ ప్రారంభంలో 63 సార్లు విఫలం చెందానని అయినా ఆధైర్య పడకుండా మళ్ళీ ప్రయత్నం చేశానని దాని ఫలితమే మీ ముందు ఉన్నా ఈ ఇంజన్ నమూనా అని తెలిపారు.

## ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవం

మూత్రపిండాల వ్యాధులపై అవగాహన కల్పించి, ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో ఈ రోజు ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా 2006 నుంచి ఏటా మార్చి నెలలో రెండవ గురువారం దీనిని జరుపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మందిలో ఒకరు దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు చెపుతున్నాయి.ఈ నేపథ్యంలో మూత్రపిండాల వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం నిర్వహణలోని ముఖ్య ఉద్దేశం. ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవాన్ని ఈ రోజు పలు అవగాహనా ప్రచారాలు, కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

## ఈనెల 13న పీఎం-కిసాన్ నిధుల విడుదల

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం-కిసాన్ పథకం 22వ విడత నిధులను ఈనెల 13వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు. అస్సాంలోని గువాహటి వేదికగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నారు. ఈ విడతలో దేశవ్యాప్తంగా సుమారు 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లో 2 వేల రూపాయల చొప్పున జమ అవుతాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం మొత్తం 19 వేల కోట్ల రూపాయిలను వెచ్చిస్తోంది. నిధులు సజావుగా జమ అయ్యేందుకు రైతులు తమ ఆధార్, e-KYC ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు

## మహిళ అభ్యున్నతికి సింగరేణి సహకారం

మహిళ అభ్యున్నతికి సింగరేణి సహకారం యాంకర్. మహిళలను సామాజికంగా, ఆర్థికంగా చేయూత అందించేందుకు సింగరేణి సంస్థ సహకరిస్తుంది. అందులో భాగంగా సింగరేణి సేవ సమితి ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం రీజియన్ లోని సింగరేణి కార్మికుల కుటుంబ సభ్యులు, పరివాహక ప్రాంత మహిళల కోసం సింగరేణి యాజమాన్యం ఉచిత శిక్షణ అందిస్తోంది. అందులో భాగంగా రామగుండంలో మగ్గం, టైలరింగ్, బ్యూటిషన్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి కోర్సులలో మహిళలకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. ఒక్కో గ్రూపులో 30 మంది చొప్పున 120 మంది మహిళలకు ఉచిత శిక్షణ అందిస్తున్నారు. తద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ఆస్కారం ఏర్పడే విధంగా సంస్థ ప్రయత్నం చేస్తుంది. మహిళలను ప్రోత్సహించే విధంగా చేపట్టిన ఈ శిక్షణలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొంటున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ ఇవ్వడం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే రుణాలతో పాటు స్వయం ఉపాధి పొందే అవకాశం ఉందని మహిళలు పేర్కొన్నారు

## పార్టీ ఫిరాయింపు కేసులో దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని ఖండించిన బీఆర్ఎస్

పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని బీఆర్ఎస్ ఖండించింది. ఈ తీర్పు ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అని BRS పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమే అని పేర్కొన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన పదవులను వ్యక్తిగత లాభాల కోసం మార్చుకుంటే, స్పీకర్ దానికి ఆమోద ముద్ర వేయటం .. ప్రజాస్వామ్య విలువలకు విఘాతం అని పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజల తీర్పును కాలరాయడమే అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ద్వంద్వనీతికి స్పీకర్ తీర్పు నిదర్శనం అని ఆరోపించారు. ..

# లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం సభలో వాడీవేడిగా చర్చ

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం సభలో తీవ్ర దుమారం రేపింది. స్పీకర్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష నేత గొంతు నొక్కుతున్నారని విపక్ష సభ్యులు ఆరోపించగా.. సభా మర్యాదలు కాపాడేందుకే కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని అధికార పక్షం సమర్థించుకుంది. అధికార, ప్రతిపక్షాల వాదోపవాదాలు, ఆరోపణలు, ప్రత్యారోపణల నడుమ చర్చ కొనసాగింది. ఈ చర్చలో 42 మంది సభ్యులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై సభలో వాడీవేడిగా చర్చ జరుగుతోంది. మంగళవారం కాంగ్రెస్ ప్రవేశపెట్టిన తీర్మానం పై ఆ పార్టీ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ ||| రాజ్యాంగాన్ని, సభా గౌరవాన్ని రక్షించడానికే ఈ తీర్మానం తీసుకువచ్చామని పేర్కొన్నారు. స్పీకర్ తటస్థంగా ఉంటారని అందరూ ఆశిస్తారని, కానీ ఓం బిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కీలక అంశాలపై మాట్లాడకుండా స్పీకర్ పదే పదే అడ్డుకుంటున్నారని విమర్శించారు. సభలో వాక్ స్వాతంత్ర్యం కరువైందని అన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ అధికార పక్షంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. దేశ చరిత్రలో ప్రతిపక్ష నేతను మాట్లాడనివ్వకుండా అడ్డుకోవడం ఇదే తొలిసారి అని మండిపడ్డారు. అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందం, అదానీ వ్యవహారం, జాతీయ భద్రత లాంటి అంశాలపై తాను మాట్లాడటానికి ప్రయత్నించిన ప్రతీసారి మైక్ కట్ చేశారని ఆరోపించారు. లోక్‌సభ అనేది దేశ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమని, అది కేవలం ఒక పార్టీకే ప్రాతినిధ్యం వహించదన్నారు. విపక్షాల ఆరోపణలను అధికార ఎన్డీయే సభ్యులు గట్టిగా తిప్పికొట్టారు. బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఒక నాయకుడిని సంతృప్తి పరచడానికే ఈ తీర్మానాన్ని ఆయుధంగా వాడుకుంటున్నారని విమర్శించారు. స్పీకర్ ఎప్పుడూ నవ్వుతూనే సభను నడుపుతున్నారని, సభ్యుల అరాచక ప్రవర్తనను అడ్డుకోవడమే పక్షపాతం కాదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితి సమయంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు రాజ్యాంగం గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. జాతీయ భద్రత అంశాలపై మాట్లాడేటప్పుడు ప్రతిపక్ష నేత ఆచితూచి వ్యవహరించాలని సూచించారు.పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. ప్రతిపక్ష ఎంపీలే వ్యక్తిగతంగా తనను కలిసి ఈ తీర్మానం తమకు ఇష్టం లేదని చెప్పారన్నారు. 2014 నుంచి కాంగ్రెస్ రాజ్యాంగ వ్యవస్థలపై దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. స్పీకర్ పదవిని రాజకీయాల్లోకి లాగడం ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. మొత్తం మీద అటు అధికార పక్షం ఇటు ప్రతిపక్షం సభ్యులు చర్చలో భాగంగా తమ వాదనలను బలంగా వినిపిస్తుండటం తో అభిశంసన తీర్మానం పై చర్చ ఆసక్తి రేకెత్తిస్తోంది.

# దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్లను కొట్టివేసిన శాసనసభ స్పీకర్



ఖైరతాబాద్ శాసన సభ్యులు దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పై దాఖలైన అనర్హత పిటిషన్లను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ రోజు కొట్టివేశారు. వీరు పార్టీ మారినట్లు ఆధారాల్లేవని, దానం, కడియం వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకొని.. వీరిద్దరినీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు 8 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలన్న పిటిషన్లను కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ నిర్ణయించారు. రాష్ట్రంలో 2023 శాసనసభ ఎన్నికల తర్వాత తమ పార్టీ గుర్తుపై గెలిచిన పది మంది శాసన సభ్యులు పార్టీ ఫిరాయించారని భారత రాష్ట్ర సమితి ఆరోపించింది. వారిని అనర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న మొత్తం 10 మంది ఎమ్మెల్యేలను



అనర్హులుగా ప్రకటించాలని BRS సభ్యులు స్పీకర్ గడ్డం ప్రసాద కుమార్ కు ఫిర్యాదు చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆ పార్టీ శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద స్పీకర్ పిటిషన్లలో ఆరోపించారు. వీరిలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ను అనర్హుడిగా ప్రకటించాలని , బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై కూడా విచారణ జరిగింది. సుదీర్ఘంగా సాగిన విచారణ సందర్భంగా అనేక పరిణామాలూ చోటుచేసుకున్నాయి. 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని దాఖలైన పిటిషన్లపై శాసనసభ స్పీకర్ నిర్ణయం

తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని, పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. 2024 సెప్టెంబర్ లో హైకోర్టు సింగిల్ జడ్జి.. 4 వారాల్లోగా విచారణ షెడ్యూల్ ఖరారు చేయాలని సూచించారు. అయితే, సింగిల్ జడ్జి గడువును సవాల్ చేస్తూ శాసనసభ కార్యదర్శి అదే ఏడాది నవంబర్‌లో డివిజన్ బెంచ్ కు అప్పీల్ చేశారు. డివిజన్ బెంచ్.... సింగిల్ జడ్జి ఆదేశాలను రద్దు చేస్తూ, స్పీకర్ సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొంది. స్పీకర్‌కు నిర్ణీత గడువు విధించలేమని, స్పీకర్ నిర్ణ-యాధికారంలో కోర్టులు జోక్యం చేసుకోకూడదని పేర్కొంది. అయితే హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును సవాలు చేస్తూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో అనర్హత పిటిషన్లపై 3 నెలలలోపు తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశిస్తూ గత ఏడాది తీర్పు ఇచ్చింది. పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ ఒక ట్రిబ్యునల్ గా వ్యవహరిస్తారని చెప్పింది. సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం స్పీకర్ అనర్హత పిటిషన్లపై విడతల వారీగా విచారణ జరిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న శాసన సభ్యులు, వారి తరపు న్యాయవాదులు, పిటిషన్లు దాఖలు చేసిన ఎమ్మెల్యేలు, వారి తరపు న్యాయ-వాదులను పిలిచి విచారించారు. తాము పార్టీ మారలేదని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్య-మంత్రిని కలిశామని, ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నామని ఆరోపణలు ఎదు-ర్కొంటున్న ఎమ్మెల్యేలు స్పీకర్‌కు అఫిడవిట్లు సమర్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను మూకుమ్మడిగా చేర్చుకొని, పదవులు కూడా ఇచ్చారని కాంగ్రెస్ నేతలు వాదించారు. విచారణ అనంతరం అరెకపూడి గాంధీ, తెల్లం వెంకటరావు, గూడెం మహిపాల్ రెడ్డి, టి.ప్రకాష్ గౌడ్, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్ కుమార్ లపై దాఖలైన పిటిషన్లను కొట్టి వేస్తూ.. ఈ 8 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారనడానికి ఎలాంటి ఆధారాలు లేవని స్పీకర్ తీర్పు ఇచ్చారు. ఇలా ఉండగా, గత నెల 6న సుప్రీంకోర్టు స్పీకర్‌కు పిటిషన్లపై నిర్ణయం వె-ల్లడించేందుకు మరో సారి 3 వారాల గడువు ఇచ్చింది. ఈ గడువులోగా నిర్ణయం తీసుకోకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని పేర్కొంది. సుప్రీంకోర్టు గడువు దగ్గర పడటంతో మరో ఇద్దరు ఎమ్మెల్యేలకు సంబంధించిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ విచారణ ముగించారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్ పార్టీ ఫిరాయించారనడానికి ఆధారాలు లేవని తీర్పు ఇచ్చారు. రెండేళ్లుగా రాష్ట్రంలో ఉత్కంఠ రేపిన ఫిరాయింపుల వ్యవహారం అధికారికంగా ఒక కొలిక్కి వచ్చినట్లయింది. ...

## మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుతో నైట్ ఎకానమీ

హైదరాబాద్ మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా నది పరివాహక ప్రాంతాన్ని నైట్ ఎకానమీ కొనసాగే విధంగా అభివృద్ధి చేయడంతో ఈ ప్రాంతంలోని యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తా-యని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ శివరాంపల్లిలో పునరుద్ధ-రించి సుందరంగా తీర్చిదిద్దిన బుమ్-రుక్న-ఉద్-దౌలా చెరువును ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించా-రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అద్భుతమైన సంస్కృతిని అందించడానికి ఈ చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని చెప్పారు

# హైదరాబాద్‌లో "నషా ముక్త్ భారత్" నినాదంతో "నో స్మోకింగ్ డే" వర్క్‌షాప్

పొగ తాగడం ముందు ఆసక్తితోనే ప్రారంభమవుతుంది.చివరకు వ్యసనం ఊబిలోకి లాగేసుకుంటుంది.సిగరెట్లు చుట్టలు, బీడీలు ఏవైనా గాని తాగిన మరుక్షణం నుండే శరీరంలోని అన్ని అవయవాల మీద విపరీత ప్రభావం చూపడం మొదడెలతాయి. నేడు హైదరాబాద్ లోని CGO టవర్స్ లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో "నో స్మోకింగ్ డే"ను "నషా ముక్త్ భారత్" అనే నినాదంతో( vartha media workshop)కార్యక్రమం నిర్వహించారు.ఇందులో శృతి పాటిల్ ADG,PIB, డా.మానస్ కృష్ణకాంత్ Dy.Director, PIB, జితేంద్ర IEC, రఘునందన్, ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్, డా.శ్రీగణ WHO కన్సల్టెంట్ (టెక్నికల్ సపోర్ట్)పాల్గొన్నారు. పొగాకు పొగలోని నికోటిన్ వదలలేని అలవాటుగా మారేలా చేస్తే.. విషతుల్యాలు ఊపిరితిత్తులు,శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు,గ్యాస్ట్రిక్ అల్సర్లు,నోరు-,గొంతు,అన్నవాహిక కాన్సర్స్, గుండెజబ్బుల వంటి దీర్ఘకాల వ్యాధులు దగ్గర నుంచి అనేక రకాల కాన్సర్ల సమస్యలకు దారి తీస్తాయి.మన దేశంలో జబ్బులకు,మరణాలకు కారణమవుతున్న ప్రధాన అంశాలలో పొగాకు అలవాటు ఒకటి.దీని మూలంగా ఏటా సుమారుగా 13లక్షల మరణాలు సంభవిస్తునాయని ఒక అంచనా.ఒక సిగరెట్,చుట్టలు,బీడీలు,హుక్క రూపంలోనే కాదు గుట్కా, ఖైని,-జర్ధ వంటివి నమలటం ద్వారాను పొగాకు వాడేవారు ఎందరో...రూపం ఏదైనా చేటు చేసేదే. కాబట్టి పొగాకుకు ఎంత దూరం ఉంటే అంత మంచిది.కావున "నో స్మోకింగ్ డే" పేరుతో మిలియన్ల మంది ప్రజలోకి పొగ సేవించకూడదనే నినాదాన్ని బలంగా తీసుకెళ్ళే పనులు చురుగ్గా సాగాలంటున్నారు... ఆరోగ్య నిపుణులు అంతే కాకుండా ధూమపానం మానేయడమే ఒక ప్రధాన ఆరోగ్య విషయమని నొక్కి చెబుతున్నారు. అందుకే ధూమపానం గురించి అవగాహన కల్పించడానికి, ధూమపానం మానే విధంగా ప్రజలను ప్రేరేపించడానికి ఏటా 'నో స్మోకింగ్ డే'ను జరుపుకుంటున్నామని నిపుణులు పేర్కొన్నారు. గుండె జబ్బులకు కాకుండ ఇంకా అనేక రకాల జబ్బులకు దారితీసే ప్రధాన ముప్పు కారకాలలో పొగ తాగటం ఒకటి. గుండెపోటు కేసులో 25% వరకు ఇదే కారణమవుతుంది. పొగ అలవాటు గల వారికీ చిన్న వయస్సులో గుండెపోటు వచ్చే ప్రమాదం ఎక్కువ.పొగ తాగేవారికి రక్తం గడ్డలు ఏర్పడే ముప్పు ఎక్కువే. శృతి పాటిల్, ADG, PIB వారు మాట్లాడుతూ నో స్మోకింగ్ డేను నిర్వహించుకోవడం జరిగిందన్నారు. పొగ తాగడం వల్ల దేశంలో లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ధూమపానం మానేయడానికి ఆరోగ్యంగా రంగ నిపుణులచే వర్క్ షాప్ ఏర్పాటు చేశామన్నారు. అనేక విషయాలపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. డా. శ్రీ గణ WHO కన్సల్టెంట్ (టెక్నికల్ సపోర్ట్) వారు మాట్లాడుతూ ప్రెస్సా ఇన్ఫర్మేషన్ బ్యూరో,నిర్వహించిన వర్క్ షాప్ లో పాల్గొని పొగ మానేయడం, టీబీ మాట్లాడడం జరిగిందని అన్నారు. జితేంద్ర IEC మెంబెర్ పోగ తాగడం వల్ల జరిగే హానికరమైన ఆరోగ్యం, పొగ తాగడం వల్ల, టీబీ అది మన శరీరంపై చూపే దుష్పరిమాణం మీడియా వారితో వర్క్ షాప్ నిర్వహించడం జరిగిందని అన్నారు. టీబీ రోగులను గుర్తించి వారికి నివారణ చర్యలో భాగంగా ప్రత్యేకత శ్రద్ధ చూపించాలని అన్నారు

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం. జాతి ప్రస్థానం లో మహిళల పాత్ర అత్యంత కీలకమని చాటిచెప్పే**




రోజు ఇది. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలకు అభినందనలు తెలియజేస్తూ... స్త్రీల పట్ల కొనసాగుతున్న అసమానతలను, వివక్షను రూపుమాపాలనే సంకల్పంతో ప్రపంచవ్యాప్తంగా వేడుకలు జరుగుతున్నాయి. "మహిళలు, బాలికలకు హక్కులు, సమానత్వం, సాధికారత" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ ప్రత్యేక సందర్భంపై దూరదర్శన్ అందిస్తున్న కథనం. కాలాన్ని లెక్కచేయకుండా కష్టపడుతున్నారు. ధైర్యాన్ని కోల్పోకుండా ముందడుగు వేస్తున్నారు. అవాంతరాలు ఎన్ని ఉన్నా నేటి మహిళ ఆగడం లేదు. శారీరక సౌకుమార్యం నుండి సాధికారత వైపు, మానసిక దుర్బలత్వం నుండి మనోబలం వైపు మహిళలు వేగంగా అడుగులు వేస్తున్నారు. వ్యవసాయం నుండి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుతూ ప్రగతిపథంలో దూసుకుపోతున్నారు. ఆకాశమే హద్దు అన్న నానుడికి కాలం చెల్లింది. నేడు ఆకాశం కూడా హద్దు కాదు అని నిరూపిస్తూ, పురుషులు మాత్రమే ఏలిన రంగాల్లో కూడా మహిళలు కాలు మోపి విజయకేతనాలు ఎగురవేస్తున్నారు. భారతీయ మహిళలు యుద్ధరంగంలో కదం తొక్కుతున్నారు. యుద్ధ విమానాలు నడుపుతూ గగనమంత ఘనతను సొంతం చేసుకుంటున్నారు. అంతరిక్ష పరిశోధనలు, రాకెట్ సైన్స్ విభాగాల్లో భారతీయ మహిళా శాస్త్రవేత్తల కృషి ప్ర-

పంచస్థాయిలో గుర్తింపు పొందుతోంది. ఇక క్రీడల విషయానికి వస్తే.. పీటీ ఉష, కరణం మల్లేశ్వరి, మేరీ కామ్, పి.వి. సింధు, నిఖత్ జరీన్, జ్యోతి యెర్రాజీ ... ఇలా ఎందరో క్రీడాకారిణులు అంతర్జాతీయ వేదికలపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తున్నారు. పోలీసింగ్ వ్యవస్థలో షీ టీమ్స్ ఏర్పాటు, మహిళా ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణ మహిళల భద్రతకు




కొత్త బాటలు వేశాయి. ప్రతి ఇంట్లో ఒక మహిళా పారిశ్రామికవేత్త ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో మహిళా పారిశ్రామికవేత్తలు సుమారు 3 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నారు. 2030 నాటికి మహిళలు 17 కోట్ల ఉపాధి అవకాశాలను సృష్టించే దిశగా ప్రయాణిస్తున్నారు. 'ముద్ర యోజన', 'స్త్రీ శక్తి యోజన', 'అన్నపూర్ణ పథకం' లాంటి పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. 2014 తర్వాత మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న 'బేటీ బచావో-బేటీ పడావో', 'సుకన్య సమృద్ధి యోజన' పథకాలు స్త్రీ శిశు నిష్పత్తిని మెరుగుపరచడంలో, బాలికల విద్యకు భరోసా కల్పించడంలో అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయి. దేశ అభివృద్ధికి మహిళల భాగస్వామ్యం అత్యంత అవసరమని ప్రధాని నరేంద్రమోదీ పలు మార్లు పేర్కొన్నారు. మహిళలు అభివృద్ధి చెందినప్పుడే సమాజం, ప్రపంచం పురోగమిస్తాయన్నారు. విద్య, వ్యాపారం, క్రీడలు, అంతరిక్షం, రక్షణ ఇలా ప్రతి రంగంలోనూ మహిళలు అద్భుతాలు చేస్తున్నారని కొనియాడారు. వారి కలలకు ఆకాశమే హద్దు కావాలని, సమాజంలో మహిళల పట్ల గౌరవం పెరగడం అంటే దేశం ఉన్నత శిఖరాలకు చేరుకోవడమేనని ప్రధాని మోదీ పలు సందర్భాల్లో తెలిపారు. ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే. మరొక వైపు చూస్తే ఇప్పటికీ మహిళల పట్ల అసమానత్వం, వివక్ష వంటి సమస్యలు సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి. వీటిని అధిగమించడానికి విద్య ఒక్కటే సరైన మార్గం. ఒక మహిళ విద్యావంతురాలైతే మొత్తం కుటుంబం విద్యావంతం అయినట్లు లెక్క. స్త్రీ పురుషుల మధ్య సమానత్వం, లింగపరమైన వివక్ష లేకుండా చూడడం ప్రతి పౌరుడి బాధ్యత. మహిళలకు సమాన పని, సమాన వేతనాలు కల్పించడం మనందరి కర్తవ్యం. మహిళలు కూడా స్వీయ ప్రేరణతో అవకాశాలను అందిపుచ్చుకోవాలి. స్వశక్తి, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథంతో సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలి. ఎన్నో సంవత్సరాల ఉద్యమాల తర్వాత సాకారమయిన చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లను అందిపుచ్చుకుని ప్రజా సమస్యలపై మహిళలు తమ గొంతుకను వినిపించాలి. అమ్మాయిల కలలకు రెక్కలు తొడిగి, వారికి అండగా నిలిచినప్పుడే దేశం అభ్యున్నతి సాధిస్తుంది. మహిళలు తాము ఎంచుకున్న రంగాల్లో విజయ బావుటా ఎగురవేసి, విజయగాథలతో మరికొంతమందికి స్ఫూర్తిగా నిలవాలి. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీ శక్తికి జేజేలు పలుకుదాం. సమానత్వంతో కూడిన నవ భారతాన్ని నిర్మిద్దాం

# పర్యాటక, సాంకేతిక రంగాల్లో కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

పర్యాటక, సాంకేతిక రంగాల్లో కొత్త అవకాశాలు సృష్టిస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేరళంలో పర్యటించిన ప్రధాని మోదీ.. రూ.11 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. కొచ్చి రిఫైనరీలో పాలీప్రొపైలిన్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. రోడ్డు మౌలిక సదుపాయాల రంగంలోని రెండు ప్రధాన హైవే ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభించారు. అనంతరం మోదీతో వికసిత్ కేరళం పేరిట కొచ్చిలో నిర్వహించిన ఎన్డీఏ సభలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలోని భారతీయుల భద్రతకు హామీ ఇచ్చారు. ఈ సంక్షోభం భారత స్వయం సమృద్ధిని చాటు చెబుతోందన్నారు. సౌర ప్రాజెక్టులు, విద్యుత్ వాహనాలు. ఇంధన రంగంలో ఇతరులపై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. భౌగోళికం, వాతావరణం, సాంకేతికత వంటి అనేక అంశాలు కేరళం సొంతమని.. పెళ్లిళ్లు, సమావేశాలకు ఇది గమ్యస్థానంగా మారాలన్నారు. ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ వేర్వేరయినా అవినీతిలో భాగస్వాములుగా ఉన్నాయని ఆరోపించారు. రెండూ కూడా కేరళం అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయని ప్రధాని విమర్శించారు

# తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ ను ప్రకటించిన ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ లో ఈ సారి రాజు వెడ్స్ రాంబాయి చిత్రం ఉత్తమ చిత్రంగా స్థానం దక్కించుకుంది. రష్మిక మందన్న, నాగచైతన్య, ఉత్తమ నటీ నటులుగా ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే NTR జాతీయ పురస్కారం ఈ సారి సీనియర్ నటులు చిరంజీవిని వరించీమది. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ - 2025 విజేతల జాబితాను అవార్డుల ఎంపిక కోసం ఏర్పాటయిన జ్యూరీ ప్రకటించింది. ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 19న అవార్డులను ప్రదానం చేయనున్నట్లు జ్యూరీ వెల్లడించింది.

ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుతో కూడిన జ్యూరీ 2025 సంవత్సరానికి గాను తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులను హైదరాబాద్ లో ప్రకటించింది. గత ఏడాది జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఫిల్మ్ సర్టిఫికేషన్ కేమడరీయ సంఘం సర్టిఫికెట్ పొందిన చిత్రాలకు, షార్ట్‌ఫిల్మ్‌లకు ఈ అవార్డులు ప్రకటించారు. ముందు ప్రత్యేక పురస్కారాలను ప్రకటించగా, ఆ తర్వాత ఉత్తమ చిత్రాలు, నటులు సాంకేతిక నిపుణుల జాబితాను వెల్లడించారు.

ప్రత్యేకపురస్కారాల్లో నటుడు చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం లభించింది. కమల్ హాసన్‌కు పైడి జయరాజ్ పురస్కారం లభించగా, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజను సినారే అవార్డు




వరించింది. నాగిరెడ్డి చక్రపాణి అవార్డును - అశ్వనీదత్ కు, ఏఎన్ఆర్ అవార్డును - జయసుధకు , టీఎల్.కాంతారావు అవార్డును - ఆర్.నారాయణ మూర్తి కీ , బీఎన్ రెడ్డి అవార్డును - సింగీతం శ్రీనివాసరావుకు జ్యూరీ ప్రకటించింది.

చిత్రాల పరంగా తండేల్ సినిమాకు గాను ఉత్తమ నటుడిగా నాగ చైతన్య, ది గర్ల్ ఫ్రెండ్ సినిమాకు గాను ఉత్తమ నటిగా రష్మిక ఎంపికయ్యారు. ఇక ఉత్తమ సినిమాగా రాజు వెడ్స్ రాంబాయి ఎంపికైంది. ఉత్తమ సందేశాత్మక చిత్రంగా - కోర్ట్ సినిమా ఎంపికయింది. ఉత్తమ సంగీత దర్శకుడు అవార్డును మార్క్ రాబిన్ ను ప్రకటించారు.

వీటితో పాటు పలు సాంకేతిక విభాగాల్లో అవార్డులకు ఎంపికైన వారి పేర్లను జ్యూరీ వెల్లడించింది. అలాగే, స్పెషల్ జ్యూరీ అవార్డులకు శ్రీరాజ్ రాచకొండ, చైతు జొన్నలగడ్డ, రోషన్ మేక, అనంతిక పేర్లను ప్రకటించారు. మరోవైపు అవార్డులు లభించినవారికి వారికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగు సినీ పరిశ్రమలో చిరంజీవి ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

గద్దర్ అవార్డులకు ఎంపికైన ప్రతి ఒక్కరికీ పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వానికి నాగార్జున కృతజ్ఞతలు తెలిపారు. ఏఎన్ఆర్ పేరుతో అవార్డును ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు

# 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి




మహిళల రక్షణ, అభ్యున్నతి కోసం కేవలం చట్టాలు చేస్తే సరిపోదని, వాటిని క్షేత్రస్థాయిలో సమ-ర్థవంతంగా అమలు చేసినప్పుడే ప్రభుత్వాల బాధ్యత నెరవేరుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని JNTUలో నిర్వహించిన 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...మహిళా సాధికా-రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, అందుకే తమ ప్రభుత్వం మహిళల ప్రతిభను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత-నిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు శక్తిమేర పదవులను కట్టబెట్టడమే కాకుండా, ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరు మీదే అందిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రేవంత్ రెడ్డి వివరించారు. హైటెక్ సిటీ వంటి ఖరీదైన ప్రాంతం పక్కనే మహిళా ఉత్పత్తుల విక్రయం కోసం 'ఇందిరా మహిళా స్టాల్స్'కు స్థలం కేటాయించినట్లు సీఎం వెల్లడించారు

# టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం

2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ లో న్యూజిలాండ్‌ను 96 పరుగుల భారీ తేడాతో ఓడించిన భారత క్రికెట్ జట్టు మూడోసారి ప్రపంచ విజేతగా నిలిచి రికార్డు సృష్టించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం సాక్షిగా భారత క్రికెట్ చరిత్రలో ఒక అద్భుతమైన అధ్యాయం ఆవిష్కృతమైంది. గత 2024 టీ20 ప్రపంచకప్ గెలుపు జ్ఞాపకాలను గుర్తుచేస్తూ.. వేలమంది అభిమానుల 'వందేమాతరం' నినాదాల మధ్య భారత్ విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయంతో టీ20 ప్రపంచకప్ చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ నెగ్గిన మొదటి జట్టుగా, అలాగే మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఏకైక జట్టుగా భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరును సాధించింది. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లు కివీస్ బౌలర్లపై కనికరం లేకుండా విరుచుకుపడి సిక్సర్ల వర్షం కురిపించారు. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌ను భారత బౌలర్లు ఆది నుంచే ఒత్తిడిలోకి నెట్టారు. ముఖ్యంగా లోకల్ హీరో అక్షర్ పటేల్ పవర్‌ప్లేలోనే ఫిన్ అలెన్ వంటి ప్రమాదకర బ్యాటర్‌ను అవుట్ చేసి భారత్‌కు శుభారంభం అందించాడు. ఆ తర్వాత జస్ప్రీత్ బుమ్రా తన బౌలింగ్ మాయాజాలంతో కివీస్ ఆశలపై నీళ్లు చల్లాడు. కేవలం 15 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టిన బుమ్రా, ఒక దశలో హ్యాట్రిక్ తీసేంత పని చేశాడు. మిచెల్ సాంట్నర్, జేమ్స్ నీషమ్ వంటి సీనియర్లను తన అద్భుతమైన స్లోయర్ డెలివరీలతో బుమ్రా క్లీన్ బౌల్డ్ చేయడం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. న్యూజిలాండ్ జట్టులో టిమ్ సీఫెర్ట్ ఒక్కడే 52 పరుగులతో పోరాడినప్పటికీ, వరుణ్ చక్రవర్తి అతడిని అవుట్ చేయడంతో కివీస్ పతనం పూర్తయింది. చివరలో అభిషేక్ శర్మ బౌలింగ్‌లో జాకబ్ డఫ్ఫీ వికెట్ తీయడంతో న్యూజిలాండ్ 19 ఓవర్లలో 159 పరుగులకే కుప్పకూలింది. ఫీల్డింగ్‌లో కూడా భారత్ అద్భుతమైన ప్రతిభ కనబరిచింది. ముఖ్యంగా ఇషాన్ కిషన్, తిలక్ వర్మలు పట్టిన క్యాచ్‌లు మ్యాచ్ ఫలితాన్ని శాసించాయి. ఈ విజయంతో భారత్ కేవలం టైటిల్‌ను గెలవడమే కాకుండా, టీ20 ఫార్మాట్‌లో తామే అసలైన 'బాస్' అని నిరూపించుకుంది. మ్యాచ్ ముగియగానే స్టేడియం మొత్తం బాణాసంచా వెలుగులతో, అభిమానుల కేరింతలతో హోరెత్తిపోయింది. ఈ సందర్భంగా భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ టీం సభ్యుల సమిష్టి కృషితో విశ్వవిజేతగా నిలువగలిగామని తెలిపారు. కోచ్ గౌతం గంభీర్ మాట్లాడుతూ భారత్ జట్టు టీ20 ప్రపంచ కప్ విజేతగా నిలవడం ఆనందంగా ఉందని అన్నారు. దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.



# సింగరేణిలో పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న మహిళలు

మంచిర్యాల జిల్లా శ్రీనివాస్ రిపోర్టర్ మంచిర్యాల జిల్లా మందమరి డివిజన్ సింగరేణిలో 270 మహిళా ఉద్యోగులు మగవారితో సమానంగా మేము విధులు నిర్వహిస్తున్నా, స్పెషల్ స్టోరీ ఉమెన్స్ డే బైట్స్ మంచిర్యాల జిల్లా మందమర్రి డివిజన్ సింగరేణి సంస్థ తన చరిత్రలో కొత్త అధ్యాయం ప్రారంభిస్తోంది. ఇప్పటి వరకు భారీ యంత్రాల నిర్వహణలో కేవలం పురుషులకే అవకాశం కల్పించిన ఈ సంస్థ, తొలిసారిగా ఓపెన్‌కాస్ట్ (ఓఎంసీ) మైన్స్‌లో మహిళలను ఆపరేటర్లుగా నియమించింది . బొగ్గు ఉత్పత్తిలో ఓఎంసీల ప్రాధాన్యం అపారమని తెలిసిందే. ఇప్పుడు ఆ మెషిన్లను మహిళలు కూడా ఆపరేటింగ్ చేస్తూ నడుపుతూ సింగరేణి మేము కూడా మగవారితో సమానంగా ఏ పనైనా చేయగలమని నిరూపిస్తున్నారు, సుమారు 135 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణి బొగ్గు కంపెనీ (Singareni Coal Company) కి ఇది ఒక విప్లవాత్మక మార్పు అని చెప్పొచ్చు. ఇప్పటివరకు ఈ రంగంలో పురుషులే ఆధిపత్యం చెలాయిస్తుంటే, ఇప్పుడు మహిళలకు కూడా సమాన అవకాశాలు కల్పించబడుతున్నాయి. నేను కూడా పురుషులతో సమానంగా చేయగలమని నిరూపిస్తూ పనిచేసి చూపిస్తున్నారు, బంకర్ ఆపరేటర్ గా, ట్విట్టర్, ఎలక్ట్రిషన్, స్టోర్ కీపర్ గా, సెక్యూరిటీ గార్డుగా, రిస్క్ టీం, చైన్ ఆపరేటర్లుగా, సింగరేణి మందమర్రి డివిజన్లో 270 మంది మహిళలు మగవారితో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. ఉమెన్స్ డే సందర్భంగా మందమారి సింగరేణి డివిజన్ ను దూరదర్శన్ ప్రతినిధి సింగరేణి లో విధుల విధులు నిర్వహిస్తున్న మహిళలతో మాట్లాడడం జరిగింది వారు కూడా పురుషులతో సమానంగా వర్క్ చేస్తున్నామని తగ్గేదే లేదు మేము కూడా ఏ పనైనా ఏ రంగంలోనైనా చేయడానికి రెడీగా ఉన్నామని, ప్రతి మహిళ ముందుండాలని, మహిళలు చేయలేని పని అంటూ లేదని మహిళా దినోత్సవం పురస్కరించుకొని అందరికీ సింగరేణి మందమర్రి డివిజన్ తరపునుంచి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు బైట్స్ సింగరేణి పలు విభాగాల్లో పని చేస్తున్న మహిళలు మాట్లాడుతూ సింగరేణి మహిళలకు ఉద్యోగాలు ఇచ్చి మమ్మల్ని ప్రోత్సహిస్తూ మగవారితో సమానంగా పని చేపిస్తూ నా టాలెంట్ ని గుర్తించి పలు విభాగాల్లో ఉద్యోగాలు ఇచ్చిన సింగరేణికి రుణపడి ఉంటామని, సింగరేణి ముందుకు తీసుకెళ్తామని అన్నారు. 1) హేమలత (సింగరేణి బంకర్ ఆపరేటర్) 2) కావ్య ( మందమరి ఏరియా వర్క్ షాప్) 3) భవాని (సీనియర్ అసిస్టెంట్ సింగరేణి మందమర్రి ) 4) శ్రేష్ఠ శ్రీ యాక్టింగ్ క్లర్క్ సింగరేణి మందమర్రి డివిజన్ జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ సింగరేణిలో మహిళలు అన్ని విభాగాల్లో పనిచేస్తున్నారని సింగరేణి మహిళలను ప్రోత్సహిస్తుందని అబ్బాయిలతో సమానంగా ఉద్యోగాలు భర్తీ చేస్తుందని, అబ్బాయిలకు దీటుగా అన్ని వీధుల్లో మహిళలు పనిచేస్తున్నారని, ప్రపంచ దేశాల్లో మహిళలు అన్ని వివాహాల్లో పనిచేస్తున్నారని ఇంకా మన దగ్గర మహిళలను ప్రోత్సహించాలని వారికి అవకాశాలు ఇస్తే అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్తారని సింగరేణి యాజమాన్యం తరపునుంచి మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు

## మహిళలే దేశానికి పునాది.. నవ భారత నిర్మాణంలో యువతులదే కీలక పాత్ర: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు కేవలం కుటుంబానికే కాకుండా, మొత్తం సమాజానికి, దేశానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. విద్యావంతులు, ఆర్థిక స్వావలంబన సాధించిన మహిళలు ఉన్నప్పుడే దేశం సంపన్నంగా, ప్రగతిపథంలో ముందుకు సాగుతుందని రాష్ట్రపతి తన సందేశంలో వెల్లడించారు. నేడు విద్య, సైన్స్, క్రీడలు, కళలు, రక్షణ వంటి ప్రతి రంగంలోనూ మహిళలు తమ అసాధారణ ప్రతిభను చాటుతున్నారని ద్రౌపది ముర్ము కితాబిచ్చారు. ముఖ్యంగా నేటి యువతులు నవ భారతదేశం కంటున్న కలలను నిజం చేసేలా తమ వంతు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. దేశంలోని మహిళలందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని రాష్ట్రపతి ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## "యువ సంగమ్" ఆరో దశ కోసం ఆన్‌లైన్ నమోదు

ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ -ఈబీఎస్‌బీ కార్యక్రమంలో భాగంగా "యువ సంగమ్" ఆరో దశ కోసం ఆన్‌లైన్ నమోదును కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ప్రారంభించింది. దేశంలోని వివిధ రాష్ట్రాల యువతకు వివిధ ప్రాంతాల పరస్పర అవగాహన పెంపొందించడం లక్ష్యంగా యువ సంగమ్ నిర్వహిస్తున్నారు.18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల ఉన్నత విద్యాసంస్థల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్వైకేఎస్ వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ebsb.aicte-india.org అధికారిక పోర్టల్ లో, లేదా ekbharat.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన యువతకు అయిదు నుంచి ఏడు రోజులపాటు విద్యా, సాంస్కృతిక యాత్రలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ, మహారాష్ట్రలోని పూణే ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థతో జతగా కార్యక్రమాలు నిర్వహించనున్నాయి

## క్యాన్సర్‌ను ఎదుర్కోవాలంటే ముందస్తు జాగ్రత్తలు ప్రాధాన్యం

క్యాన్సర్‌ను సమర్థంగా ఎదుర్కోవాలంటే ముందస్తు జాగ్రత్తలు, త్వరిత నిర్ధారణ, నాణ్యమైన వైద్య సేవలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. హైదరాబాదులోని హైటెక్స్‌లో ఒమెగా క్యాన్సర్ ఫౌండేషన్ ను ఆమె నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కుటుంబం, ఉద్యోగం, సమాజంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్యం, సంక్షేమం ప్రాధాన్యతగా ఉండాలని పేర్కొన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

# రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు బాగుండాలి: సీఎం రేవంత్ రెడ్డి

ప్రజలు ఏ సమస్య వచ్చినా మొదట పోలీసుల వైపే చూస్తారని, మెరుగైన సేవలందించడం ద్వారానే శాఖకు గౌరవం పెరుగుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో జరిగిన పోలీసు అధికారుల 'రిట్రీట్' కార్యక్రమంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతికత పెరగడంతో నేరాలు కొత్త మార్గాల్లో జరుగుతున్నాయని, ముఖ్యంగా భౌతికంగా కనిపించని నేరాలు పోలీసులకు సవాలుగా మారాయన్నారు. వీటిని ఎదుర్కోవడానికి అధికారులు నిరంతరం అప్‌గ్రేడ్ కావాలని సూచించారు. రాష్ట్రం లేదా దేశం అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు బాగుండాలని, అప్పుడే పెట్టుబడులు వస్తాయని సీఎం స్పష్టం చేశారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా కేవలం 2.5% ఉన్నప్పటికీ, దేశ జీడీపీకి 5% వాటాను అందిస్తోందని, దీనిని .. 10%. కి చేర్చడమే తమ ప్రభుత్వ ఆశయమన్నారు. ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరులో ట్రాఫిక్, ముంబయి-చెన్నైలలో వరద సమస్యలను ప్రస్తావిస్తూ.. పాలకులకు దూరదృష్టి లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని అన్నారు. మన నగరాల్లో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ కేవలం 2 సెం.మీ. వర్షపాతాన్ని మాత్రమే తట్టుకోగలదని, భవిష్యత్తు అవసరాలను గుర్తించి పని చేయాలని అధికారులను కోరారు. సాంకేతిక సవాళ్లను మనకున్న వనరుల ద్వారానే అధిగమించగలమని, సమస్యను సరిగ్గా అర్థం చేసుకుంటే సగం పరిష్కారం దొరికినట్లేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు

# కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు కన్నుమూత

కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు మరణం పట్ల తెలుగు రాష్ట్రాల రాజకీయ నాయకులు, ప్రముఖులు, ప్రజలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కొద్దిరోజులుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు 82 ఏళ్ళు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కావూరి సాంబశివరావు 1943లో అప్పటి కృష్ణా జిల్లాలో జన్మించారు. పారిశ్రామిక వేత్తగా అంచెలంచెలుగా ఎదిగిన సాంబశివరావు, నాలుగు దశాబ్దాల పాటు క్రియాశీల రాజకీయాలలో తనదైన ముద్ర వేశారు. ఐదుసార్లు లోక్ సభకు ఎన్నికయ్యారు. 1984,1989, 1998 ఎన్నికల్లో మచిలీపట్నం నుంచి లోక్ సభ ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2004, 2009 సంవత్సరాల్లో ఏలూరు నుంచి లోకసభలో ప్రాతినిధ్యం వహించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో జౌళిశాఖ మంత్రిగా సేవలందించారు. 2014 వరకూ కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా ఉన్న కావూరి .. రాష్ట్ర విభజన తర్వాత బీజేపీలో చేరారు.

## ఒలింపిక్ పతకాలే లక్ష్యంగా 'సంసద్ ఖేల్ మహోత్సవ్'.. మక్తల్‌లో గోడ పత్రికల ఆవిష్కరణ

జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసి ఒలంపిక్స్ లో అత్యధిక పథకాలను సాధించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి మోదీ.. ప్రధానమంత్రి సంసద్ కేల్ మహోత్సవ్ నిర్వహిస్తున్నట్లు బిజెపి రాష్ట్ర నేత కొండయ్య వెల్లడించారు.. నారాయణపేట జిల్లా మక్తల్ మండల కేంద్రంలో క్రీడా పోటీలకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి జాతీయస్థాయిలో క్రీడలను నిర్వహిస్తూ ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీస్తున్నారన్నారు.. మహబూబ్ నగర్ పార్లమెంటు పరిధిలో ఏప్రిల్ 9 నుంచి 24 వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు.. ఈనెల 24వ తేదీ వరకు క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

## భద్రాద్రి రామయ్య కల్యాణ ఏర్పాట్లపై కలెక్టర్ అంకిత్ సమీక్ష

భద్రాద్రి దివ్య క్షేత్రంలో ఈనెల 27 28న జరగనున్న శ్రీ సీతారాముల సిరి కళ్యాణ మహోత్సవం, పట్టాభిషేకం మహోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో జరుగుతున్న ఏర్పాటులను భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని నూతన కలెక్టర్ అంకిత్ మొదటిసారి దర్శించుకున్నారు...అనంతరం శ్రీరామనవమి కళ్యాణం ఏర్పాట్ల కొరకు మిథిలా స్టేడియంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులను ఏర్పాటులను జరుగుతున్న పనులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ...శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం మరియు పట్టాభిషేకం తిలకించడానికి వచ్చే భక్తులకు వేసవిని దృష్టిలో పెట్టుకొని ఇరిగేషన్ శాఖ ద్వారా కల్యాణ మండపంలోని భక్తులకు మరియు కళ్యాణం మండపం బయట ఉండే భక్తులకు ఇరిగేషన్ శాఖ ద్వారా ప్రత్యేకంగా పాలి హౌజ్ లు ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రస్తుతం దేవస్థానానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి అయిపోయాయని, కళ్యాణ మండపంలో జరగవలసిన ఏర్పాట్లను ప్రత్యేకంగా అధికారులను నియమించడం జరిగిందని, అధికారులు వారికి అప్పగించిన పనుల ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారని అన్నారు. వివిధ రాష్ట్రాల నుండి భక్తులు భద్రాచలం రాగానే వారికి కళ్యాణమండపానికి నేరుగా వెళ్ళడానికి ముఖ్యమైన ప్రదేశాలలో భక్తులకు తెలిసే విధంగా ఫ్లెక్సీలు, రూట్ మ్యాప్ లు ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులందరికీ స్వామివారి తలంబ్రాలు, ప్రసాదాలు అందరికీ అందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎండాకాలం నడుస్తున్నందున భక్తులు వారు బసచేసే ప్రాంతం నుండి కళ్యాణ మండపానికి రావడానికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని, కళ్యాణం తిలకించడానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని, అందుకు భక్తులు కూడా అధికారులకు సహకరించి స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించి తిరిగి మీ గమ్యస్థానాలకు చేరుకోవాలని అన్నారు.

## ఎలక్ట్రానిక్స్ తయారీపై నోబెల్ గ్రహీతతో మంత్రి అశ్విని వైష్ణవ్ చర్చలు

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం న్యూఢిల్లీలో నోబెల్ గ్రహీత ప్రొఫెసర్ కాన్స్టాంటిన్ నోవోసెలోవ్, లోహమ్ సీఈఓ రజత్ వర్మలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే 2D మెటీరియల్స్ తయారీ, వాటి వినియోగంపై ప్రధానంగా చర్చించారు. ఈ భేటీలో ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరును మెరుగుపరచడంలో 2D మెటీరియల్స్ పాత్ర గురించి వివరించారు. వీటితో పాటు పర్యావరణ హితం కోసం పర్మనెంట్ మాగ్నెట్లు, బ్యాటరీల రీసైక్లింగ్ ప్రాముఖ్యతను కూడా చర్చించారు. స్థిరమైన ఇంధన వనరుల కోసం సర్క్యులర్ ఎకానమీ పద్ధతులను అనుసరించడం ద్వారా ఎలక్ట్రానిక్స్, క్లీన్ ఎనర్జీ రంగాన్ని ఎలా బలోపేతం చేయవచ్చనే అంశాలపై చర్చించారు.

## కేరళలో రూ.11,000 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

కేరళంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామిక వృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఎర్నాకుళం వేదికగా సుమారు రూ.11 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (BPCL) ఆధ్వర్యంలోని కొచ్చి రిఫైనరీలో రూ.5,500 కోట్లకు పైగా పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న పాలీప్రొపైలిన్ యూనిట్‌కు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ యూనిట్ ఏడాదికి 400 కిలో టన్నుల సామర్థ్యంతో పనిచేయనుంది. ప్యాకేజింగ్, ఆటోమోటివ్ విడిభాగాలు, వైద్య పరికరాలు, వస్త్ర పరిశ్రమ, గృహోపకరణాల తయారీలో పాలీప్రొపైలిన్ అత్యంత కీలకం. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ ఉత్పత్తిని పెంచడం ద్వారా తయారీ రంగానికి ఇది ఉపయోగపడనుంది. రోడ్డు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా రెండు భారీ జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. NH-66లోని తలపడి - చెంగల సెక్షన్ మధ్య సుమారు రూ.2,650 కోట్ల వ్యయంతో ఆరు లేన్ల రహదారి నిర్మించారు. ముంబై - కన్యాకుమారి ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా ఉన్న ఈ రహదారి కాసరగోడ్, కన్నూర్ జిల్లాలకు కనెక్టివిటీ పెంచుతుంది. దీంతో మంగళూరు, ముజపిలంగడ్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. వెంగళం నుండి రామనట్టుకర వరకు దాదాపు రూ.2,140 కోట్ల ఖర్చుతో ఆరు లేన్ల కోజికోడ్ బైపాస్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇది కోజికోడ్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడమే కాకుండా, వాణిజ్య రవాణాను వేగవంతం చేస్తుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. కేరళ పారిశ్రామిక సామర్థ్యాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## పశ్చిమాసియా నుంచి 45 విమానాల ద్వారా భారతీయుల తరలింపు

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్వయంగా అక్కడి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రయాణికుల భద్రత, విమాన సర్వీసుల కొనసాగింపునకు ఎటువంటి ఆటంకం కలగకుండా విమానయాన సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. మార్చి 9 నాటి గణాంకాల ప్రకారం, పశ్చిమాసియా నుండి 45 విమానాల ద్వారా సుమారు 7,407 మంది ప్రయాణికులు సురక్షితంగా భారత్ చేరుకున్నారని విమానయాన శాఖ అధికారులు వెల్లడించారు. మరోవైపు విమానాల రాకపోకల సౌలభ్యం కోసం మస్కట్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రత్యామ్నాయంగా వినియోగించుకోవడానికి డీజీసీఏ అనుమతి ఇచ్చింది. దుబాయ్, అబుదాబి, జెడ్డా, మదీనా వంటి నగరాలకు వెళ్లే విమానాలు అత్యవసర సమయంలో ఇక్కడ ల్యాండ్ అవ్వొచ్చు. విమానాల రాకపోకలకు ఆటంకం కలగకుండా అదనపు అరైవల్, డిపార్చర్ స్లాట్లను కేటాయిస్తున్నారు. ఇక ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఇండిగో సంస్థలు మార్చి 12 నుండి రియాద్‌కు కొత్త సర్వీసులను ప్రారంభించనున్నాయి. ఆకాశ ఎయిర్ తన ముంబై-రియాద్ సర్వీసులను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవాలని సూచించగా, స్పైస్‌జెట్‌కు ప్రత్యామ్నాయ విమానాశ్రయాల వినియోగంపై అనుమతులు లభించాయి. అయితే యుద్ధ వాతావరణం కారణంగా విమాన టికెట్ల ధరలు అసాధారణంగా పెరగకుండా కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోంది. ధరల పెరుగుదలను అరికట్టి, ప్రయాణికులకు భారం కలగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## మడగాస్కర్ కు భారత్ ఆపన్న హస్తం

ఫైటియా, గెజానీ తుపానుల బీభత్సంతో అతలాకుతలమైన మడగాస్కర్‌కు భారత్ 12 టన్నుల వైద్య సామాగ్రి, 18 టన్నుల విపత్తు సహాయక సామగ్రిని ఐఏఎఫ్ సీ-17 విమానం ద్వారా పంపింది. ఈ సహాయంలో ప్రాణరక్షక మందులు, శస్త్రచికిత్స పరికరాలు, టెంట్లు, నీటి నిల్వ ట్యాంకులు తక్షణమే తినగలిగే ఆహార పదార్థాలు ఉన్నాయి. భారీ వరదలతో చిక్కుకున్న మొజాంబిక్‌కు సైతం భారత్ సంఘీభావం తెలుపుతూ 500 మెట్రిక్ టన్నుల బియ్యం, 10 టన్నుల నిత్యావసరాలు, 89 టన్నుల మందులను పంపినట్లు విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. హిందూ మహాసముద్ర ప్రాంతం, ఆఫ్రికా దేశాలకు భారత్ ఎల్లప్పుడూ నమ్మకమైన ఫస్ట్ రెస్పాండర్ గా ఉంటూ తన నిబద్ధతను చాటుకుంటోందని ఎంఈఏ పేర్కొంది. ఈ ఏడాది ప్రారంభంలో కేటగిరీ-3 స్థాయి తీవ్రతతో వచ్చిన తుపానులు మడగాస్కర్‌లోని మౌలిక సదుపాయాలను, జనజీవనాన్ని తీవ్రంగా దెబ్బతీసిన నేపథ్యంలో భారత్ ఈ సాయం అందించింది.

## దేశంలో వేగంగా 'కవచ్' పనులు: లోక్‌సభలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

దేశీయంగా అభివృద్ధి చేసిన రైలు రక్షణ వ్యవస్థ 'కవచ్' పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో తెలిపారు. ఇవాళ సభలో అడిగిన అనుబంధ ప్రశ్నలకు సమాధానమిస్తూ.. కవచ్ అనేది ఐదు ఉప-వ్యవస్థలతో కూడిన అత్యంత సంక్లిష్టమైన సాంకేతికత అని వివరించారు. ఇప్పటివరకు 8,570 కిలోమీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ వేసినట్లు తెలిపారు. 1100కు పైగా టెలికాం టవర్లను ఏర్పాటు చేయగా, 767 స్టేషన్లలో డేటా సెంటర్లను నిర్మించినట్లు పేర్కొన్నారు. అలాగే 6,776 కిలోమీటర్ల మేర ట్రాక్ సైడ్ ఎక్విప్‌మెంట్‌ను అమర్చారని రైల్వే శాఖ మంత్రి వెల్లడించారు. వాస్తవానికి ఈ పనులు 90వ దశకంలోనే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, 2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాతే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కిందని మంత్రి గుర్తు చేశారు. మరో అనుబంధా ప్రశ్నలకు మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. రైల్వే ట్రాక్‌లపై వన్యప్రాణుల రక్షణ కోసం అండర్ పాస్ లు, ఓవర్ పాస్ లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఏనుగుల వంటి వన్యప్రాణులను కాపాడేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) కెమెరాలు, ఆప్టికల్ ఫైబర్ కేబుల్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు చెప్పారు. కొంకణ్ రైల్వే సామర్థ్యాన్ని పెంచేందుకు డీపీఆర్ పనులు జరుగుతున్నాయని, టన్నెల్స్, ట్రాక్ ల బలోపేతంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు భాగస్వాములుగా ఉన్నాయని, కర్ణాటక, కేరళ ప్రభుత్వాల నుంచి మరింత సహకారం అవసరమని మంత్రి అశ్విని వైష్ణవ్ కోరారు.

## తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా ప్రమాణస్వీకారం

తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ లోని లోక్‌భవన్‌లో అధికార లాంఛనాలతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నూతన గవర్నర్ చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. అపార రాజకీయ అనుభవం ఉన్న శివ్ ప్రతాప్ శుక్లా ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్‌పూర్ నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గతంలో ఉత్తరప్రదేశ్ విద్య, జైళ్లు, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా పని చేశారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా సేవలందించారు. 2023 ఫిబ్రవరి నుంచి హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న శివ్ ప్రతాప్ శుక్లా, ఇప్పుడు తెలంగాణ గవర్నర్ గా బాధ్యతలు స్వీకరించారు.

## మార్చి 9 న బహు భాషావేత్త బెజవాడ గోపాల రెడ్డి వర్ధంతి

స్వాతంత్ర్య సమరయోధులు, బహు భాషావేత్త బెజవాడ గోపాల రెడ్డి వర్ధంతి మార్చి 9 న. ఆంధ్ర రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగాను, ఉత్తరప్రదేశ్కు గవర్నర్గాను సేవలందించిన ఆయన... నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో 1907 ఆగష్టు 7వ తేదీన జన్మించారు. 11 భాషల్లో ప్రావీణ్యులైన గోపాల రెడ్డి అనేక పుస్తకాలు రచించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన గీతాంజలి, ఊర్వశి వంటి పలు రచనలను తెలుగులోకి అనువదించిన గోపాల రెడ్డి 1997 మార్చి 9వ తేదీన కన్నుమూశారు.

## పెద్దపూర్ మల్లన్న జాతరలో జనసందోహం.. భక్తిశ్రద్ధలతో 70 వేల బోనాల సమర్పణ

జగిత్యాల జిల్లాలోని మెటుపల్లి మండలం పెద్దపూర్ గ్రామంలో 70 వేల బోనాలతో నిర్వహించే అతి పెద్ద మల్లన్న స్వామి బోనాల జాతర..... తెలంగాణ లో అతిపెద్ద బోనాల జాతర జగిత్యాల జిల్లాలోని మెటుపల్లి మండలం పెద్దపూర్ గ్రామంలో జరుగుతుంది. కముడి పౌర్ణమి తరువాత వచ్చే మొదటి ఆదివారం రోజున స్వామి వారికి దాదాపు 60 నుండి 70 వేల బోనాలను భక్తులు మల్లన్న స్వామికి సమర్పిస్తారు. ఉదయం నుండి మల్లన్న స్వామి ని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జాతరకు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ తోపాటు చుట్టుపక్కల రాష్ట్రాల నుండి భక్తులు వచ్చి మల్లన్న స్వామిని దర్శించుకొని పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటారు. దాదాపు 3 లక్షల మంది భక్తులు ఈ వేడుకలలో పాల్గొంటారు. మల్లన్న స్వామి జాతర సందర్భంగా మూడు రోజుల పాటు వేడుకలు ఘనంగా జరుగుతాయి. మొదటి రోజు మల్లన్న స్వామి కల్యాణం, రెండవ రోజు మల్లన్న స్వామికి బోనాలు సమర్పించుకుంటారు. మూడవ రోజు నాగవేల్లి, అగ్ని గుండాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ చలువ పందిళ్లు, త్రాగునీరు, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. శివసత్తుల పునకాలు, పోతారాజుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ మెంబర్స్ జీవన్ రెడ్డి మరియు రమేష్ రెడ్డి మాట్లాడుతూ కముడి పౌర్ణమి తరువాత వచ్చే మొదటి ఆదివారం రోజన బోనాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దాదాపు 3 లక్షల మంది భక్తులు వస్తారని, 70 వేల బోనాలు భక్తులు స్వామివారికి సమర్పిస్తారని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ తరుపున చలువ పందిళ్లు, త్రాగునీరు, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. మల్లన్న స్వామి జాతర సందర్భంగా మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# విశాఖపట్నం: ఏయూ శతాబ్ది ఉత్సవాలు




వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనలో యువత భాగం కావాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో వై.వి.ఎస్. మూర్తి ఆడిటోరియంలో వికసిత్ భారత్ - 2047, స్వర్ణాంధ్ర - 2047 ఆంధ్రవిశ్వవిద్యాలయానికి అవకాశాలు అనే అంశంపై ప్యానల్ డిస్కషన్ ను నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ..పూర్వ విద్యార్థుల మేధస్సు వర్సిటీకి విలువైన సంపదగా నిలుస్తుందని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యాలను సాకారం చేయడంలో ఏఐ కీలకంగా ఉంటుందని తెలిపారు.

# 16న అమరావతిలో శ్రీ పొట్టి శ్రీరాముల విగ్రహ ఆవిష్కరణ



ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని భవిష్యత్ తరాలకు గుర్తుచేసే లక్ష్యంతో అమరావతిలో స్మృతివనం నిర్మాణం జరుగుతోందని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. అమరావతిలోని తుళ్లూరు సమీపంలో నిర్మిస్తున్న పొట్టి శ్రీరాములు విగ్రహ నిర్మాణ పనులను ఆమె నిన్న పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీన అమరజీవి జయంతి వేడుకల సందర్భంగా 6.8 ఎకరాల స్మృతివనంలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' పేరుతో ఏర్పాటు చేస్తున్న 58 అడుగుల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని చెప్పారు.

## ఖతార్లోని భారతీయ పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని భారత ఎంబసీ సూచన

పశ్చిమ ఆసియాలో యుద్ధ ఉద్రిక్తతలు ఇప్పుడు గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ క్రమంలో ఖతార్ రాజధాని దోహాలోని భారత రాయబార కార్యాలయం అక్కడి లక్షలాది మంది భారతీయ పౌరుల భద్రత దృష్ట్యా అత్యవసర ప్రయాణ హెచ్చరికలను జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎంబసీ స్పష్టం చేసింది. యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రజలెవరూ అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, వీలైనంత వరకు సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండాలని భారత రాయబార కార్యాలయం సూచించింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తప్పుడు వార్తలు, ఊహాగానాలను నమ్మి ఆందోళన చెందవద్దని, వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని కోరింది. కేవలం ఖతార్ ప్రభుత్వ అధికారిక ఛానళ్లు విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అత్యవసరమైతే తప్ప ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేయవద్దని, పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ఎంబసీ తన అడ్వైజరీలో పేర్కొంది. గల్ఫ్ రీజియన్లో నెలకొన్న అనిశ్చితి దృష్ట్యా భారత ప్రభుత్వం అక్కడి భారతీయుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు.

## పశ్చిమ ఆసియా దేశాల్లో ఈ నెల 5, 6 తేదీల్లో జరగాల్సిన సీబీఎస్ఈ 10, 12 తరగతుల పరీక్షలు వాయిదా

పశ్చిమ ఆసియా దేశాల్లో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు ఇప్పుడు విద్యార్థులపై కూడా ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ నెల 5, 6 తేదీల్లో జరగాల్సిన సీబీఎస్ఈ 10వ తరగతి, 12వ తరగతి పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యంగా బహ్రెయిన్, ఇరాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల్లోని సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలకు ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. ఆయా దేశాల్లో నెలకొన్న అసాధారణ పరిస్థితుల వల్ల విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం ఇబ్బందిగా మారే అవకాశం ఉండటంతో, వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. వాయిదా పడిన పరీక్షల కొత్త తేదీలను త్వరలోనే అధికారిక వెబ్సైట్ ద్వారా ప్రకటిస్తామని బోర్డు స్పష్టం చేసింది. ఇక ఈ నెల 7వ తేదీ నుండి జరగాల్సిన మిగతా పరీక్షల నిర్వహణపై సీబీఎస్ఈ బోర్డు గురువారం మరోసారి సమీక్ష నిర్వహించనుంది. పశ్చిమ ఆసియాలో మారుతున్న పరిణామాలను గమనించి, ఆ దేశాల్లోని పరిస్థితులకు అనుగుణంగా తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు.

## సౌదీలోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ల దాడి



ఇరాన్ తన సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతికి ప్రతీకారం తీర్చుకునే క్రమంలో దాడులను మరింత తీవ్రతరం చేసింది. తాజాగా సౌదీ అరేబియా రాజధాని రియాద్లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ రెండు డ్రోన్లతో దాడికి పాల్పడింది. ఈ డ్రోన్ దాడులతో ఎంబసీ ప్రాంగణంలో భారీ ఎత్తున మంటలు చెలరేగగా, ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకుంది. దాడి జరిగిన సమయంలో కార్యాలయం మొత్తం ఖాళీగా ఉండటంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని సౌదీ రక్షణ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. సౌదీలోని రియాద్, జెడ్డా, దహ్రాన్ ప్రాంతాల్లో నివసిస్తున్న అమెరికన్ పౌరులందరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని, వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అమెరికా రాయబార కార్యాలయం కీలక ఆదేశాలు జారీ చేసింది.

## అమెరికా భద్రత కోసమే ఇరాన్పై దాడులు: యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అంతర్జాతీయ వేదికపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్పై అమెరికా జరిపిన దాడులను ఆయన పూర్తిగా సమర్థించారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడటమే తమ ప్రాధాన్యత అని, అందుకోసమే ఇరాన్పై దాడులు చేయాల్సి వచ్చిందని జేడీ వాన్స్ స్పష్టం చేశారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదన్నదే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దృఢ సంకల్పమని పేర్కొన్నారు. గతంలో టెహ్రాన్తో సుదీర్ఘంగా చర్చలు జరిపినప్పటికీ, అవి

ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదని వాన్స్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్ తన అణ్వాయుధ కార్యక్రమాన్ని రహస్యంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోందని ట్రంప్ ముందే గ్రహించారని, అందుకే ఆ దేశాన్ని నిలువరించేందుకు కఠిన చర్యలు చేపట్టారని వివరించారు. అమెరికాను సురక్షితంగా ఉంచడం కోసం ఏ స్థాయి నిర్ణయానికైనా వెనుకాడబోమని జేడీ వాన్స్ తేల్చి చెప్పారు. అయితే, ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల మధ్య కూడా ఇరాన్లో ఒక స్నేహపూర్వక ప్రభుత్వం ఏర్పడితే తాము స్వాగతిస్తామని వాన్స్ తెలిపారు. ఇరాన్ ఉగ్రవాదానికి స్వస్తి పలికి, అణ్వాయుధ పరీక్షలకు దూరంగా ఉండాలని తాము కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.



## పెరుగుతున్న ముడి చమురు ధరలు.. ఒక్కరోజే 3 డాలర్లకు పైగా పెరిగిన బ్రెంట్ క్రూడ్

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వణికిస్తున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చడం 'చమురు'పై ప్రభావం చూపుతోంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. వరుసగా మూడో రోజూ ధరలు పెరిగి, బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర ఒక్కరోజే 3 డాలర్ల కంటే ఎక్కువగా పెరిగి సుమారు 80.89 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణా అయ్యే



అత్యంత కీలకమైన 'హార్ముజ్' జలసంధిని ఇరాన్ మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రపంచానికి అందే చమురులో 20 శాతం ఈ మార్గం నుంచే వెళ్లాలి. ఇప్పుడా దారి మూసుకుపోవడంతో సముద్రంలో ఆయిల్ ట్యాంకర్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీనికి తోడు బీమా కంపెనీలు ట్యాంకర్లకు ఇన్సూరెన్స్ ఇవ్వడం మానేయడంతో రవాణా ఖర్చులు చుక్కలను తాకుతున్నాయి. సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారంపై కూడా డ్రోన్ దాడులు జరిగాయి. యుద్ధం ఇలాగే కొనసాగితే చమురు ధరలు బ్యారెల్‌కు 150 డాలర్ల వరకు పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# కాశీమజిలీ కథలు

ధారావాహిక -ఐదవభాగం

డా. మాదిరాజు బ్రహ్మానంద రావు




## దేవతా వస్త్రముల కథ

గ్రామాధికారులు రాజు వద్దకు వెళ్లి "రాజా! నూలు అద్భుతంగా ఉంది. భూలోకంలో ఇట్లాంటి నూలును మేమెప్పుడూ చూడలేదు. ఆ నూలు గాని- ఆ బట్టలుగాని మనుషుల చేత తయారు చేయబడిందంటే ఎవరు నమ్మరు. అది నిజంగా భగవంతుడొక్కడు మాత్రమే చేయగల"డంటూ అని పొగడ సాగారు. ఈ విషయాన్ని వారు రాజునకే కాదు- వారికి కనిపించిన వారికందరికీ చెప్పసాగారు.

మరిరెండు నెలలు గడిచాయి. బట్టలెంతవరకు పూర్తియయ్యాయో తెలుసుకొని రమ్మని రాజీసారి దండనాథుని పంపాడు. దండనాథుడు రాగానే రాముడు లేని నూలును వస్త్రాలను చూపించసాగాడు. ఈ బట్టలెంత బాగున్నాయో-ఎంత మెత్తగా ఉన్నాయో పట్టుకొని చూడమన్నాడు. దండనాథునకు నూలు గాని బట్టలు గాని కనిపించలేదు. ఇందుకు కారణం తన తల్లియేనని కుమిలిపోయాడు. తమతల్లి గ్రామాధికారుల తల్లుల వంటి సుగుణవంతు రాలు కాదని విచారపడి దాన్ని మనసులోనే ఉంచుకొని రాజు వద్దకు వెళ్లి పట్టుసాలెవారిని -నూలు వస్త్రాలను పొగడ సాగాడు. మరో నెల గడిచిన తర్వాత రాజు తన మంత్రి దుర్బుద్ధిని వస్త్రాలను చూచిరమ్మని పంపాడు. మంత్రికి కూడా లేని వస్త్రాలను వరప్రసాదులు చూపారు. వస్త్రాలను చూడలేని మంత్రి కూడా తన తల్లి శీలాన్ని శంకించాడు. దీన్ని కప్పిపుచ్చి మంత్రి కూడా రాజు వద్దకు వెళ్లి పట్టుసాలీలను-బట్టలను అద్భుతమని ప్రశంసించాడు. ఆరునెలల గడువు పూర్తి అయింది. ఒక రోజు రాముడు రాజసభకు వెళ్లి రాజునకు నమస్కరించి రాజుతో "దేవా! దేవతావస్త్రాలు పూర్తియయ్యాయి. మేము ఈ బట్టలనేతను అనేక సంవత్సరాలు తపస్సు చేసి నేర్చుకున్నాము. ఇవి దేవతా వస్త్రాలు కాబట్టి ఆనాడు స్త్రీలకు పురుషుని చూసే స్వేచ్ఛ కూడా ఉంటుంది. తమకు కొత్త పద్ధతులు అంటే చాలా ఇష్టం కాబట్టి ఈ దేవతావస్త్రాలను మీరు రేపు రాణిగారితో పాటుగా ఊరేగింపుగా వచ్చి బట్టలను కట్టుకో"మని చెప్పి వెళ్లిపోయాడు. రాజు సంతోషంతో నగరం అంతా అలంకరింప చేయమన్నాడు. మంత్రి సామంత పురోహితులతో తాను పట్టపురాణితో పట్టపుటేనుగునెక్కి మంగళ వాయిద్యాలతో వరప్రసాదులుండే భవనాన్ని చేరుకున్నాడు. వసంతుడొక పళ్ళెంతో వచ్చి దేవతావస్త్రాలు చూడమని చూపాడు. రాజునకేమీ కనిపించ లేదు. తన తల్లి జారిణి అని భావించి ఆమెను లోలోన తిట్టుకోసాగాడు. అప్పుడు రాముడు కలగజేసుకొని రాజుతో "మీకేమీ కనిపించడం లేదా? ఈ నూలు బాగోలేదా? ఈ బట్టలు మంచిగా లేవా? అంటూ ప్రశ్నలను గుప్పింపసాగాడు. దీన్ని తట్టుకోలేక రాజు "బట్టలు కనపడుతున్నాయి కానీ ఈ బట్టలు కట్టుకొని మా తల్లికి మొక్కాలనిపిస్తుంది" అంటూ మంత్రి దుర్బుద్ధితో 'ఈవస్త్రాలు నీవిదివరకు చూసిన వస్త్రాల వలె నాణ్యంగా ఉన్నాయో లేవో' చూసి చెప్పమన్నాడు. మంత్రి వాటిని చూస్తున్నట్టు నటిస్తూ 'ఇదివరకు తాను చూసిన వస్త్రాల కంటే సుందరంగా నాణ్యంగా ఉన్నా'యన్నాడు. రాజు అక్కడున్న వాళ్ళనందరిని ఇదే ప్రశ్న

అడిగాడు. అందరూ తమకేమీ కనిపించకపోయినా కనిపించినట్టుగా బాగా ఉన్నాయని నమ్మబలికారు. రాజు భార్యతో 'ఈ వస్త్రాలను చూస్తు'న్నావా అని అడగ్గా ఆమె కూడా ఏమీ కనబడకపోయినా తన తల్లి శీలాన్ని శంకిస్తూ 'ఈ దేవత వస్త్రాలు బాగున్నా'యని అబద్ధమాడింది. రాజు రాణి తర్వాతపౌరులందరు దేవతావస్త్రాలను పొగడిన తరువాత రాముడు రాజుగారిని నిలుచుండ బెట్టి కట్టుకున్న వస్త్రాలను ఊడదీసి మాయా వస్త్రాలు కడుతున్న వాని వలె నటిస్తూ రాజును దిగంబరుని చేశాడు. దిగంబరుడైన రాజును చూసిన ప్రతివాడు రాజు కట్టుకొన్న వస్త్రాలు కనిపించక పోవటం వలన తమతమ తల్లులదోషాన్ని తలుచుకొని తేలుకుట్టిన దొంగల్లాగా మిన్నకుండిపోయారు. వరప్రసాదులు ముందు నియమించుకున్న ఒక కాంత చేత రాణి గారి ఒంటిమీద ఉన్న బట్టలను విప్పించి దేవతా వస్త్రాలను కట్టింపించారు. రాజు రాణి తమ దిగంబరత్వం తామొక్కరికే కనబడుతున్నదని- అందరికీ తాము బట్టలు కట్టుకున్న వారిగానే కననబడుతున్నామని భావించారు. రాజు రాణి దిగంబరంగానే పట్టపుటేనుగు నెక్కి ఊరేగింపుకు బయలుదేరారు. దిగంబరులై ఊరేగుతున్న రాజ దంపతులను మేడలపై నుండి చూస్తున్న పౌరకాంతలు సిగ్గుతో తలుపులు మూసుకోసాగారు.




ఊరేగింపు పూర్తయిన తరువాత ఆ రాజదంపతులు అంతఃపురానికి వెళ్లారు. ఏకాంతంలో రాజు రాణితో "కాంతామణీ! నీవు కట్టుకున్న చీర నాకు ఏమీ కనిపించటంలేదు. అపకీర్తి వస్తుందనే భయంతో నిజం చెప్పలేక పోయాను". అని అనగా అప్పుడు రాణి కూడా "రాజా! ఆ నేతగాండ్రు తెచ్చిన పళ్లెంలో నాకు బట్టలేవీ కనిపించలేదు. తల్లి కళంకాన్ని కప్పి పుచ్చుకోవడానికి నేను అబద్ధం ఆడాను" అని అంది. రాజుకు నిజం తెలిసింది. తామిద్దరిని దిగంబరంగా ఊరేగించిన వారిపై రాజునకు అంతులేని కోపం వచ్చింది. అప్పుడు మంత్రి దుర్బుద్ధిని, దండనాథుని, గ్రామాధికాలను పిలిపించాడు. నిజం చెప్పమనాడు. అందరూ మాతాపాతకాన్నిమరుగుపరచడానికి అబద్ధమాడామన్నారు. రాజు పట్టుసాలెవారిని పట్టితెమ్మని బంట్లను వరప్రసాదులున్నభవనానికి పంపించాడు. భటులకు వారు దొరకలేదు. వారికక్కడ ఒకలేఖ దొరకగా దాన్ని తెచ్చి రాజునకు ఇచ్చారు. అందులో ఇట్లా ఉంది "మహారాజశ్రీ అపూర్వ దుర్మార్గ చర్యాభిలాషులైన కానీన మహారాజుగారికి కపటపు పట్టుసాలీలు వ్రాయునది: నీవు లోకవిరుద్ధమైన పనులు చేయటం వల్ల ఇంద్రుడు మా యైదుగురిని నీ వద్దకు దూతగా పంపాడు. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని విపరీత శాసనాలు చేయటం మానుకో. లేకపోతే ఇంద్రుని ఆజ్ఞను మన్నింపని వానిగా నిన్ను భావించి నిన్ను రాజ్య భ్రష్టుని చేసి దండిస్తాము. సుబుద్ధిని మంత్రిగా చేసి రాజ్యాన్ని పరిపాలించు" అనే సందేశమున్న ఆ లేఖను చదువుకున్న రాజు ఇంద్రునితో వివాదం పెట్టుకోవడం నష్టమే గాని లాభం లేదని భావించాడు. ఇకనుండి ప్రజలు రాత్రిని రాత్రిగాను-పగలిటిని పగలుగాను భావించమని ఆజ్ఞాపత్రాలు పంపించాడు. ప్రజలు సంతోషాలను అనుభవిస్తుండగా రాజు మునుపటి మాదిరిగా రాజ్యాన్ని సుఖంగా పరిపాలించ సాగాడు.

డా. మాదిరాజు బ్రహ్మానందరావు

# యక్షప్రశ్నలు -భావోద్వేగాల నియంత్రణ



పాలకుర్తి రామమూర్తి

మహాభారతంలో అరణ్యపర్వం ఉదాత్తమైనది. అరణ్యపర్వాన్ని సాధనాపర్వంగా చెపుతారు. అరణ్యపర్వంలో ఆరంభమైన ధర్మరాజు సాధన అరణ్యపర్వం చివర యక్షుని పరీక్షతో సమాప్తమౌతుంది. నిజానికి యక్షప్రశ్నలను ఎదుర్కొన సమయంలో ధర్మరాజు మానసిక స్థితి తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నది. విపరీతమైన దాహబాధ ఒకవైపు, మరొకవైపున తన నలుగురు తమ్ములు నిర్జీవుల వలె కొలను గట్టున పడిఉన్నారు. అలాంటి సమయంలో మానసిక సమతుల్యతను కోల్పోకుండా యక్షుని ప్రశ్నలకు సమాధానలు ఇవ్వాలి. దానికి భావోద్వేగాలను నియంత్రించుకోవాలి.. స్ఫురణను పొందాలి.. స్మృతి పనిచేయాలి... అలా తనను తాను నిర్వహించుకున్నాడు కాబట్టే అతను చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

తథా న నశ్యతి తమః కృతయా దీపవర్తయా |
తత్కర్మ యన్న బంధాయ సా విద్యాయా విముక్తయే. 55
ఆయాసాయాపరం కర్మ విద్యాన్యా శిల్పనైపుణాత్|
శీలం పరహితత్వం చ కోపాభావః క్షమా ధృతిః. 56

దేని వలన అయితే మనం బంధింపబడమో అది కర్మ. దేని వలన అయితే మనం జ్ఞానం సంపాదిస్తామో అది ముక్తి . ఎలాగైతే దీపం వల్ల చీకట్లు తొలిగిపోతాయో అలాగే విద్య వల్ల అంటే జ్ఞానం వల్ల కర్మ బంధాలు తొలిగిపోతాయి. మంచి కర్మలు మనకు తరించే మార్గం చూపుతాయి... మిగిలిన అన్నీ కర్మలు వృధా ప్రయాసలే . అలాగే ఉన్నతీకరించే జ్ఞానం వల్ల ముక్తి లభిస్తుందే కాని మిగిలిన విజ్ఞానం అంతా నైపుణ్యమే అంటుంది దేవీభాగవతం. మహాభారతంలో ధర్మరాజు ఐహిక బంధనాలలో చిక్కుకున్న వాడే.. కాకపోతే తన బుద్ధి అక్షరాస్యతను కాక విద్యను ఆశ్రయించింది కాబట్టే భగవదనుగ్రహం కలిగింది.. వచ్చిన కష్టాలను తట్టుకొని తనను తాను ఉన్నతీకరించుకునే మార్గం లభించింది... ఆ మార్గంలో నడక సులువయింది. ధర్మరాజు ప్రతిప్రశ్నకు వినయంతో బదులు ఇచ్చాడు.. వినయము అంటే... విశేషమయిన నయము.. లేదా నీతి. బ్రతక వలసిన విధానాన్ని ధర్మం చెపుతుంది... ఆలోచించాల్సిన విధానాన్ని జ్ఞానం చెపుతుంది. ఈ రెంటి సమ్మిళిత విధానం జీవితాన్ని అనుగ్రహిస్తుంది. సమగ్ర జీవితాన్ని అనుభవించి వికాసవంతుడై ముక్తిని పొందడమే జీవునికి ఆదర్శం. ధర్మజ్ఞానాలను బోధించేది శాస్త్రం.. ఆ శాస్త్రం యొక్క సారం... మహాభారతం... యక్ష ప్రశ్నలు.. మనకు అవగాహన పెంచేందుకై భారతంలో ఇరువురు ధార్మికుల మధ్య ప్రశ్నోత్తరాల రూపంలో ఆవిష్కృతమయ్యాయి. ధర్మరాజును తిరగ రాస్తే రాజధర్మం.. రాజ ధర్మాన్ని తిరగ రాస్తే ధర్మరాజు అవుతుంది. యక్ష ప్రశ్నలు... పెద్దవిగా లేవు.. చిన్న ప్రశ్న.. దానికి సూటిగా అనుగుణమైన జవాబు...

ఈ ప్రశ్నలు.. సమాధానాలు యువతకు ఎలా ఉపయుక్తమౌతాయి? ఈ ప్రశ్నకు సమాధానం వెతుక్కుంటే.... భావ వ్యక్తీకరణ ఎలా ఉండాలో తెలుసుకునే వెసులుబాటు ఇక్కడ కనిపిస్తుంది. భావ వ్యక్తీకరణ అంటే...? ఎవరిని ఉద్దేశించి మనం ఏ సమాచారాన్ని పంచుకోవాలని అనుకుంటున్నామో ఆ సమాచారం వారికి స్పష్టంగా అర్థమవడం, దానిని వారు అంగీకరించడం లక్ష్యంగా సమాచారం అందించాలి. ఆ సామర్థ్యాన్ని మనం భావవ్యక్తీకరణ నైపుణ్యం అంటాము. ఈ నైపుణ్యం సంతరించుకోవాలి అనుకునే వారికి ....

1. తనపై తనకు నమ్మకం ఉండాలి...
2. సరైన పదాలను ఎన్నుకొని స్పష్టంగా పలకాలి...
3. తాను చెప్పే అంశంపై తనకున్న నమ్మకం ఎదుటి వారికి కూడా అవగతం కావాలి...
4. తికమక లేకుండా వ్యంగ్యంగా, వక్రంగా, శ్లేషలు లాంటివి కాకుండా...సరిగా మాట్లాడాలి...
5. మాట్లాడే పలుకులే కాకుండా శారీరక భాష కూడా సరిగా ఉండాలి...
6. పలుకులలో వినయం కనిపించాలి.

సమస్య ఎదురైన వేళ దానిని అధిగమిస్తూ.. భావవ్యక్తీకరణ జరిపే ప్రక్రియలో భావోద్వేగాల నియంత్రణ ప్రముఖ పాత్రను పోషిస్తుంది. మానసిక శాస్త్రజ్ఞులు దాదాపు 20 సంవత్సరాల కాలం చేసిన ఒక పరిశోధన ప్రకారం "భావోద్వేగాలను నియంత్రించుకోలేనివారి"లో ఆవేశం, అమాయకత్వం హెచ్చుగా కనిపించాయి. వారు ప్రగతిని చూడలేక పగటి కలలు కంటూ ప్రశాంత జీవితానికి దూరంగా చిన్న స్థాయిలో మిగిలిపోయారు. "భావోద్వేగాలను అప్పుడప్పుడు ప్రదర్శిస్తూ ఒక్కొక్కసారి నియంత్రించుకోగలిగిన వారు"... కొందరు ఉన్నత స్థాయిలోనూ కొందరు తక్కువ స్థాయిలోనూ జీవితాన్ని నిర్వహించుకున్నారు. అదే "భావోద్వేగాలను నియంత్రించుకున్నవారి"లో చాలా మంది ఉన్నత స్థాయిలో జీవితాన్ని గడిపారు. సంతృప్తికరంగా జీవించారు. ఆ పరిశోధకుల ఉద్దేశ్యం ప్రకారం... భావోద్వేగాలకు సంబంధించిన బీజం చాలా చిన్నతనంలోనే పడుతుందట. వయసు పెరిగే కొద్దీ దానిని నియంత్రించుకునే విధానాన్ని వివిధ మార్గాలలో చక్కగా అభ్యసించాలి. భావోద్వేగాలకు బంధీ కాకుండా జీవితాన్ని నిర్వహించుకున్న వారే జీతాన్ని రసమయం చేసుకుంటారు... విజయసాధకులుగా నిలుస్తారు. పేరు ప్రఖ్యాతులు సాధించిన వారెందరో తమ భావోద్వేగాలపై నియంత్రణ కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవడం, పదవులు కోల్పోవడం, ఆపదల పాలుకావడం, అపఖ్యాతి పాలుకావడం మనం చూస్తూనే ఉన్నాము. భావోద్వేగాలను ప్రదర్శించడం తప్పుకాదు... ఒక్కొక్కసారి దానిని ప్రదర్శించ వలసిన అవసరం రావచ్చు.. ప్రదర్శించాలి కూడా.. అయితే ఆ భావోద్వేగాలను ప్రదర్శించే విధానం సరైనది కావాలి. ఆవేశం, దుఃఖం, భయం, సంతోషం, ప్రేమ, ఆశ్చర్యం, ద్వేషం, సిగ్గు లాంటివి భావోద్వేగాలుగా చెపుతారు. వాటిని సరైన సమయంలో సరైన రీతిలో ప్రకటించడం అవసరం. ఈ నేపథ్యంలో ధర్మరాజు యక్షప్రశ్నలను పరిశీలిస్తే... సాధారణంగా కుటుంబ సభ్యుల తీవ్ర అనారోగ్యం, ఆత్మీయ మిత్రుల మరణం, అనుకోని ఆపదలు చుట్టుముట్టడం లాంటివి ఎవరినైనా భావోద్వేగానికి గురిచేస్తాయి. దానితో నిరాశా నిస్పృహలు ఆవరించి మెదడు స్తబ్దుగా మారిపోతుంది. అలాంటిది ఎదురుగుండా అమిత బలశాలులైన నలుగురు తమ్ములు

(46 వ పేజీ చూడండి)

# బ్రహ్మఖండం



డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

వేదవ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలలో స్కాంద పురాణం ఒకటి. ఎనభైఎనిమిది వేల ఒక వంద శ్లోకములతో కూడిన ఈ పురాణం పురాణాలలోకెల్లా అతి పెద్దది.
ఈ పురాణం మహేశ్వర, వైష్ణవ, బ్రహ్మ, కాశీ, అవంత్య, నగర మరియు ప్రభాస అనే ఏడు (7) ఖండాలుగా విభజింపబడింది. అందులో మూడవ భాగమైన 'బ్రహ్మ ఖండం' మూడు ఉపఖండాలుగా విభజింపబడింది.
ఇదివరలో మన చైతన్యం సంకల్పబలం పత్రికా పాఠకులకు 'కాశీ ఖండం' అందించిన ప్రముఖ రచయిత శ్రీ పోచనపెద్ది వేంకట మురళీకృష్ణ గారు ఇప్పుడు 'బ్రహ్మఖండం' సమర్పిస్తున్నారు.
పాఠకులు ఈ పురాణ పఠన సదవకాశాన్ని వినియోగించుకుని ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాము.

-ఎడిటర్

29.వ. అధ్యాయం.

సర్వ తీర్థ ప్రశంస..

సాధ్యామృత తీర్థంలో స్నానం చేసాక " సర్వ తీర్థాన్ని" సేవించాలి. ఈ తీర్థం సర్వ పాతక నాశనం, కలుగుతుంది. ఆత్మ శుద్ధి కలుగుతుంది. పునర్జన్మ ఉండదు. గాయ. త్రిజపం, వేదాధ్యయనం, దేవతారాధన, ఏకాదశి వ్రతం ఆచరించడవలన లభించు పుణ్యం సర్వతీర్థంలో స్నానం చేయడం వలన లభిస్తుంది. " మహర్షులారా! ఈ తీర్థానికి సర్వ తీర్థం అను పేరు ఎందుకు వచ్చిందో చెబుతాను శ్రద్ధగా వినండి" అని సూతుడు ఈ విధంగా చెప్పాడు.

పూర్వం సుచరితుడు అను ముని భృగు వంశంలో జన్మించాడు. అతడు పుట్టుకతో గుడ్డివాడు. అతనికి తీర్థ యాత్రలు చేయాలనే కోరిక ఉండేది.అంధుడు అగుటచే అతని కోరిక తీరలేదు గంధ మాదన పర్వతం చేరి శంకరుని ఉద్దేశించి తపస్సు చేసాడు. పది సంవత్సరాలు ఉగ్రమైన తపస్సు చేసాడు. శంకరుడు ప్రత్యక్షమై, సుచరిత మహర్షికి చూపు ఇచ్చాడు. సుచరితుడు ఆనందించి ఈ విధంగా స్తుతించాడు.

సుచరితుడు శివుని స్తుతించుట------------------

జయదేవ మహేశాన జయ శంకర ధూర్జటే

జయ బ్రహ్మాది పూజ్య త్వం త్రిపురఘ్న యమాంతక

జయోమేశ మహాదేవ కామాంతక జయమాల

జయ సంసార వైద్య త్వం భూతపాల శివావ్యయ

త్రియంబక నమస్తుభ్యం భక్తరక్షణ దీక్షిత

వ్యోమకేశ నమస్తుభ్యం జయ కారుణ్య విగ్రహ

నీలకంఠ నమస్తుభ్యం జయ సంచార మోచక

మహేశ్వర నమస్తుభ్యం పరమానంద విగ్రహ

గంగాధర నమస్తుభ్యం విశ్వేశ్వర మృడావ్యయ

నమస్తుభ్యం భగవతే వామదేవాయ శంభవే

శర్వాయోగ్రాయ భర్గాయ కైలాస పతయే నమః

రక్ష మాం కరుణా సింధో కృపాదృష్ట్యవలోకనాత్

మమవృత్త మనాలోచ్య త్రాహిమాం కృపాయా హర . (22-28)




దేవా! మహేశా! శంకరా! ధూర్జటి! బ్రహ్మాది పూజితా! త్రిపుర సంహారా! యమాంతకా! ఉమేశా! మహాదేవా! కామాంతకా! అమలా! నీకు జయం. సంసార వైద్య భూతపాలా! శివా! అవ్యయా! త్రియంబకా! భక్తరక్షణ దీక్షా! నీకు నమస్కారం. వ్యోమకేశా! కారుణ్య నిగ్రహా! నీలకంఠా!సంసార మోచకా!మహేశ్వరా!పరమానంద విగ్రహా! విశ్వేశ్వరా! మృఢా! అవ్యయా! నీకు నమస్కారం.శర్వా! ఉగ్రగర్భా! కైలాసపతీ! నీకు నమస్కారం. కృపాదృష్టితో నన్ను రక్షించు. " అని సుచరితుడు ప్రార్థించాడు. పరమేశ్వరుడు కరుణించి " నీకు కావలసిన వరాన్ని కోరుకో" అని ఆదేశించాడు." చంద్రశేఖరా! నాకు ముసిలి తనం వచ్చింది. ఎక్కడికి వెళ్ళలేను. అన్ని తీర్థంలో స్నానం చేసే పుణ్యం నాకు లభించునట్లు చేయి" అని సుచరితుడు ప్రార్థించాడు.

" సుచరితా! ఇక్కడికి అన్ని తీర్థాలను ఆవాహన చేస్తున్నాను. ఈ తీర్థం మహా పాతక నాశనం. ఈ తీర్థాన్ని సర్వ తీర్థము అని పిలుస్తారు. అందరి మనస్సు ఆకర్షించడం వలన " మానస తీర్థం" అని పిలుస్తున్నారు. భుక్తి, ముక్తి, లభిస్తుంది. నీవు ఇక్కడ స్నానం చేయి. మహా పాతకాలు నశిస్తాయి. కామ,మోహ,లోభాలు, క్రోధం నశిస్తుంది." అని పరమేశ్వరుడు చెప్పగానే సుచరితుడు సర్వ తీర్థంలో స్నానం చేసాడు. వెంటనే అతని ముసలితనం పోయింది. యౌవ్వన వంతుడయ్యాడు. ఆతీర్థమహాత్మ్యాన్ని చూచి అందరు ఆశ్చర్యపోయారు. " ఓ సుచరితా! నీవు జీవితాంతం ఇక్కడే ఈ తీర్థాన్ని సేవించి చివరిలో నన్ను పొందుతావు" అని చెప్పి పరమేశ్వరుడు అంతర్థానమయ్యాడు. సుచరితుడు జీవితాంతం సర్వతీర్థాన్ని సేవించి చివరికి శంకరుని చేరాడు.

ఈ అధ్యాయం చదివిన వారు పాపాలనుండి ముక్తి పొందుతారు.

స్కాంద పురాణంలోని బ్రహ్మ ఖండంలోని సేతు మాహాత్మ్యంలోని " సర్వతీర్థ ప్రశంస" అను ఇరవై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు --13వ భాగం
ఆప్రాంతం అంతా రకరకాల పూల చెట్లు, పండ్ల చెట్లు, రకరకాల పక్షులు ఎంతో అందంగా ఉండి రకరకాల శబ్దాలు చేస్తున్నాయి.తపో సంపన్నులు అనేక రకాల ఆసనాలతో కొందరు పులి చర్మం , కొందరు జింక చర్మం ధరించి తపస్సు కొనసాగిస్తున్నారు.కొంత మంది హోమములు చేస్తున్నారు.చతుర్ముఖ బ్రహ్మ కూడా అక్కడ ఉండి తపస్సు చేయడాన్ని వశిష్టులవారు గమనించారు. దాంతో ఓరాజా చతుర్ముఖ బ్రాహ్మ, ఇంద్రుడు మొదలైన దేవతలు మహా మునులు,యోగుల తో గూడా ఇచ్చటనే తపస్సు చేయుచున్నాడు. శ్రీ మన్నారాయణుని దర్శనం బ్రహ్మ దులకు లభించే అవకాశం ఉంది .గాన నీవు స్వామి పుష్కరిణిలో స్నానం చేసి అష్టాక్షరీ మహామంత్రం తో తపస్సు చేస్తే మీకు కూడా స్వామి దర్శనం లభిస్తుంది.అనగానే దశరధుడు స్వామి పుష్కరిణిలో స్నానంచేసి వచ్చి వశిష్టులవారి నుండి అష్టాక్షరీ మహామంత్రాన్ని స్వీకరించి తపస్సు ప్రారంభించారు.వశిష్టులవారు గూడా దర్భసనం పై కూర్చుని అష్టాక్షరీ మహామంత్రాన్ని జపించడం ప్రారంభించారు. కొంత కాలానికి స్వామి ప్రత్యక్ష మై అక్కడ ఉన్న బ్రహ్మ ది దేవతలతో పాటు వశిష్ట,దశరధులకు కూడా వారు చేసిన తపస్సు కు మెచ్చి స్వామి కాని పించారరు. బ్రహ్మదులు స్వామిని అనేక విధాలుగా కీర్తించి "రావణుడు" దేవ, దానవులం దరినీ వారి పనులు వారు చేసుకోనివ్వకుండా అడ్డుకుని అనేక బాధలకు గురి చేస్తున్నాడని అతడు దేవ,దానవులచే మరణంపొంద కుండా అనేక వరాలు సంపాదించు వున్నాడని, అతనిని మేము ఏమీ చేయలేని పరిస్తితి గాన అతని వల్ల మాకే కాదు ఈ లోకానికి కూడా రక్షణ లేదని ప్రార్థించగా స్వామి భయపడవద్దని.. రావణుని అతని పరివారాన్ని బంధువుల తో సహా సంహరిస్తానని కంగారు పడవద్దని బ్రహ్మ కు మాట ఇచ్చారు.అగస్త్యునితో నీ కోరిక ఏమిట ని అడుగుగా ... ఈ కొండపైన ఉన్నవారు అంతా సుఖంగా ఉండాలని కోరుకున్నారు . స్వామి అగస్త్యముని తో నీకోసం నీవు కోరు కోకుండా ఇక్కడ వారి కోసం కోరినావు గాన ఈ వేంకటాచల క్షేత్రము నందు నివశించే వారందరికీ ఆరోగ్యం,సంపద,సంతానం,సంపూర్ణ ఆయుర్దాయం ఇస్తానని స్వామి అన్నారు.సనకాదులతో స్వామి మీకు ఏమి కావాలని కోరగా అందరికీ ఈ కొండమీద నీ దర్శనం లభించాలని కోరితే స్వామి సరేనని అంగీకరించారు. దేవేంద్రుని స్వామి పలకరించగా అతడు కూడా రావణుని బాధలు పడలేకుండా ఉన్నా మని చెప్పడంతో రావణుని సంహరించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. స్వామి అక్కడ కు వచ్చిన వారందరికీ వరుసగా వారాలు ఇస్తూ దశరధుని పలకరించగా అయ్యా! స్వామి తమదయవల్ల చాలాకాలం నుండి రాజ్యాన్ని పాలించు చున్నాను.బ్రాహ్మణులకు పేదలకు దానధర్మాలు చేస్తున్నాను.శత్రువులను జయించా కాని పుత్ర సంతానం లేక బాధపడుతున్నాఅనగా నీవు గత జన్మలో కొన్ని పాపాలు చేశావని స్వామి చెప్పగా ...... దశరధుడు దాసుణ్ణి క్షమించాలి అంటూ మిమ్ములను దర్శించిన తరువాత నాకు ఇంక పాపాలు ఎక్కడ ఉంటాయి స్వామి అంటూ రెండుచేతులూ జోడించి స్వామి ని నాలుగు శ్లోకములతో కీర్తించగా స్వామి ఆనందంతో నీవు ఒక యజ్ఞం చేస్తే నాతో సమానమైన వీరులైన. నలుగురు కుమారులు జన్మిస్తారని వరం ఇచ్చారు.దాంతో దశరధుడు స్వామి కి నమస్కరించి వశిష్టులవారితో కలిసి అయోధ్యా నగరానికి చేరారని" శ్రీ వరాహ పురాణం "తెలియ జేస్తోంది

(ఇంకా ఉంది)

# "పుష్పాద్రి" శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు
## (అతి పురాతమైన క్షేత్రం)



డా॥కె.రామానందం

మన దేవాలయాలు ప్రజలకు ఆధ్యాత్మిక సంపదలను పంచి, వారిని సన్మార్గములో పయనింపజేయుటకు దోహదపడుతున్నాయి. కొన్ని దేవాలయాలు, కొండలు, గుట్టలపై నెలకొని ఉన్నాయి. అటువంటి పుణ్యక్షేత్రాలను చేరడానికి శారీరిక శ్రమ తప్పదు. అదే సమయంలో శారీరిక శ్రమ ఆరోగ్యదాయకమే. అక్కడ లభించే గాలి, నీరు పరిశుభ్రంగా ఉండి మన ఆరోగ్యాన్ని కాపాడుతుంటాయి. అంతేకాక, రమణీయమైన ప్రకృతి దృశ్యాలు, మనోహ్లాదాన్ని కలిగిస్తుంటాయి. అందుకే ఆలయం దర్శనం ఇహపర సౌఖ్యదాయకం. గుంటూరు జిల్లాలో, గుంటూరు నగరానికి పశ్చిమాన 7 కి.మీ. దూరంలో నల్లపాడు ప్రాంత పరిధిలో పుష్పాద్రి క్షేత్రం ఉంది. కొండవీటి కొండల తూర్పు పాదతలములో ఈ పుష్పాద్రి ఉంది. కొండవీటి కొండలు నల్లమల శాఖలే. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారు పుష్పాద్రి శేషుని పడగవలె ఉన్న గుహలో స్వయంవ్యక్తులై భక్తులను అనుగ్రహిస్తున్నారు. తేజోమూర్తియైన ఈ స్వామివారు మూగవారికి మాటలు ర ప్పిస్తాడని, దీర్ఘకాలిక రుగ్మతలను పోగడతాడని, శనిగ్రహ దోష నివారణ గావించుతాడని భక్తజన విశ్వాసం.

సుమారు 200 సం॥ల క్రిందట శ్రీ నరసింహ స్వామివారి సమీపంలోనే శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత ఆకాశ మల్లేశ్వరస్వామివారు ప్రతిష్టింపబడినారు. ఈ



ఆకాశ మల్లేశ్వర లింగము పుట్టుకతో యజ్ఞోపవీతము కలిగి ఉంది. అందుకే ఆ శివలింగము ఆకాశము నుండి ప్రభవించి ఉండునని తలచి స్వామివారిని ఆకాశ మల్లేశ్వరుడని పిలుచుకుంటున్నారు. ఒక ప్రదేశములో శివకేశవులిరువురూ పూజలు అందుకునేచుండుటచే పుష్పాద్రి హరిహర కళాక్షేత్రంగా భక్తజనావళిచే కీర్తింపబడుతోంది.

స్థ ల పు రా ణ ం : స్వామి వారు ఈ క్షేత్రంలో అవతరించడం వెనుక ఒక దివ్యమైన గాథ ఉంది. సృష్ట్యాదిలో త్రిమూర్తులను సృష్టించిన ఆదిపరాశక్తి, వారిని స ష్టి, స్థితి, లయ బాధ్యతలను అప్పగించినది, బ్రహ్మదేవుడు తనకు అప్పగించబడిన సృష్టి కార్యము నిర్వహించుటలో భాగంగా తొలత సనక, సునందన, సనత్కుమార, సనత్సుజాతులనే నలుగురిని సృష్టించి, వారికి తన సృష్టి కార్యములో తోడ్పడమన్నాడు. కానీ వారు తమ తండ్రి సూచనను సున్నితముగా తిరస్కరించి, తపోభూములకేగి తపమాచరించడానికి తమకు అనుజ్ఞ ఇవ్వవలసినదిగా వేడుకున్నారు. బ్రహ్మదేవుని అనుమతితో ఆ నలుగురు తమ తపస్సుకు అనువైన భూమిని వెతుకుతూ బయలుదేరారు.

వారందరు నల్లమల కొండల-లోని ఒక గుహను ఎంచుకుని అందులో కొన్ని లక్షల సంవత్స-రాలు కఠోర తపస్సు గావించారు. వారి తపస్సునకు సంతసిం-చిన శ్రీమన్నారాయణుడు, వారి మధ్య శ్రీలక్ష్మీదేవి సహితముగా నరసింహ రూపంలో ప్రత్యక్షమై, కావలసిన వరాలను అడగమ-ని ఆదేశించారు. ఆ దైవర్షులు స్వామివారిని తమకు గోచరిం-చిన విధముగానే, గోచరించిన చోటనే అర్చామూర్తిగా వెలిసి భూలోకవాసుల కోరికలను తీ-ర్చవలసినదిగా ప్రార్థించారు. స్వామివారు, వారి కోరికలను మన్నించి, యధారూపంలో ఆ గుహలోనే స్వయంభూ అర్చ-మూర్తిగా, వారి మధ్యనే వెలిసినా-రు. స్వామివారి మూర్తికి ఒకప్రక్క సనక, సనందనలు మరొకపక్క సనత్కుమార, సనత్సుజాత దేవ-ర్షులు చిత్తరువులు కూడా కొండ శిలపై సహజముగా ఏర్పడినవే. భక్తులు స్వామివారికి ఎదురుగా కాకుండా ఒకొంత పక్కలకు ఇరువైపులా జరిగి శ్రద్ధగా పరిశీ-లిస్తే, బ్రహ్మ మానస పుత్రుల చి-త్తరువులను కూడా చూడవచ్చు. క త, త్రేత, ద్వాపర యుగాలలో స్వామివారు నాటి ప్రజల పూజలను అందుకుని ఉంటారు. కలియుగంలో ఈ ప్రాంతమంతా దట్టమైన అడవిగా మారిపోయిం-ది. స్వామివారు ఆవిర్భవించిన గుహ ప్రాంతమంతా బడి పూల తీగలు, పుచ్చ తీగలతో చుట్టి వేయబడి కనుమరుగైపోయింది. సుమారు 10`12 వందల సంవ-త్సరాల క్రిందట ఇక్కడ అరణ్య సాంద్రత తగ్గి జన వాసాలు ఏర్ప-డసాగాయి. ఆ కాలంలో కొందరు కాపరలు తమ మేకలను పుష్పా-ద్రిపై మేపుకొనుచుండగా ఒక మేక, మేకల మంద నుండి తప్పి-పోయింది. దానిని వెతుకుతూ ఆ కాపరులు గుహను చుట్టూ ఉన్న తీగమొక్కల చెంతకు చేరుకున్నా-రు. ఆ గుబురులో మేక ఉన్నదని తలచి వారు తీగలన్నిటిని కోసి వేయగా ఓ గుహ, ఆ గుహలో స్వామివారు ప్రత్యక్షమయ్యారు. ఆ విషయాన్ని గ్రామస్తులకు తె-లియజేశారు. నాటినుండి పరిస-రాల గ్రామ ప్రజలు స్వామివారికి పూజలు నిర్వహించ సాగారు. స్వామివారిని నమ్మిన భక్తులు కోరికలు తీరుతుండటం వల్ల క్రమేణా ఆ స్వామివారిని దర్శించే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఆ స్వామి-వారికి రాజుల భక్తి కంటే సాధారణ ప్రజల భక్తియే అధికము.

ఆలయ విశేషాలు: పుష్పాద్రి ఆలయం కొండపై ఉన్నది. అచ్చటకు జేరుటకు మెట్ల దారి ఉంది. ఈ దారి ప్రా-రంభంలో ఉత్తరం వైపున స్వామి వారి కళ్యాణ మండపము ఉంది. దాని ముందు సహజ వల్మీకము (పుట్ట). వల్మీకము ముందు నా-గేశ్వర ప్రతిష్ఠ ఉంది. మెట్లదారిలో పైకి వెడితే ఉత్తర దిశలో దక్షిణా-భిముఖముగా శ్రీ లక్ష్మీనరసింహ-స్వామి వారి వెలిసిన గుహ కాన-వస్తుంది. గుహను చూస్తే శేషుని పడగవలె ఉంటుంది. ఆ పడగనీ-డలో శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి అర్చామూర్తి ఉంది. స్వామివారు చతుర్భుజులు, ఎడమకాలు పైకి మడిచి, కుడికాలను క్రిందకి చాచి కూర్చున్న భంగిమలో స్వామివా-రున్నారు. శ్రీలక్ష్మీదేవి స్వామివారి వామంకపీఠమును అలంకరిం-చి వున్నారు. స్వామివారు క్రింది చేతితో లక్ష్మిదేవిని పట్టుకుని, పై ఎడమ చేతితో శంఖమును ధరించారు. స్వామివారు గుహపై ప్రాచీన కాలంలోనే విమాన గోపురం నిర్మింపబడినది. చాలా కాలం తర్వాత గుహ ముందున్న శ్లాబు కప్పుతో ముఖ మండపా-న్ని గుహతో కలిపి వేశారు. ముఖ మండప నిర్మాణంతో అంతరాళ-ము కూడా ఏర్పడినది. అంతరా-ళములో పడమర వైపున గోదాదే-వికి, తూర్పు వైపున శ్రీ రాజ్యలక్ష్మి దేవికి గర్భలయాలు నిర్మింపబ-డ్డాయి. స్వామివారి గుహముం-దొక చిన్న మందిరం ఉంది. అందులో స్వామివారు భ తు-డైన గరుత్మంతుడు, ఆయన కి-రువైపులా ఆంజనేయుడు, ఆది-శేషులు ఉన్నారు. ఈ మందిరం వెనుక ధ్వజస్తంభం ఉంది. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారము నృసింహ ఆలయంలో నిత్యపూ-జలు శాస్త్రోక్తంగా జరుగుతుం-టున్నాయి. ప్రతి ఏకాదశి, ప్రతి పౌర్ణమి, ప్రతి స్వాతి నక్షత్రం వంటి పర్వదినాల్లో స్వామివారికి విశేష

అలంకరణలు, విశేష పూజలు నిర్వహిస్తారు. కార్తీక ధనుర్మాసాల్లో విశేష పూజలు జరుపుతారు. ప్రతిరోజు సుప్రభాత సేవ జరుపుతారు. ప్రతి వైశాఖ శుద్ధ చతుర్దశి నాడు జయంతి మరియు స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ ఆలయ జీర్ణోద్ధరణకు చాలామంది తమ వంతు సహాయ సహకారాలు అందించారు. శ్రీ బెల్లంకొండ రామానంద సరస్వతి పూర్వ ప్రజ్ఞాచార్యులు, లక్ష్మణాచార్యులు, వెంకట రాఘవాచార్యులు మున్నగు భాగవోత్తములు స్వామిని కీర్తిస్తూ అనేక గేయ రచనలను చేసి ధన్యులైనారు. యాత్రికులు గుంటూరుకు వచ్చి అక్కడ నుండి ఆటోలలో, బస్సుల్లో పుష్పాద్రి క్షేత్రాన్ని చేరుకోవచ్చు. వసతి సౌకర్యాలకు గుంటూరు పట్టణంలోనే చూసుకోవాల్సి ఉంటుంది. కోరిన వరాలనిచ్చే శాంత స్వరూపుడు కోరుకొండ లక్ష్మి నృసింహస్వామి... ఈ కోరుకొండపై వెలిసిన నృశింహుడు ఎల్లవేళలా భక్తుల అభీష్టాలను ప్రసాదిస్తూ భక్తుల కొంగు బంగారమైనాడు. కొండపై శ్రీలక్ష్మి సమేతుడై నృసింహుడు స్వయంభువుగ విరజిల్లుతున్నాడు కొండపైకి వెళ్ళుటకు ఘాటి రోడ్డు లేదు. కేవలం మెట్లు దారినే ఉపయోగించి భక్తులు పైకి వెళ్ళవలసి ఉంటుంది. చాలామంది రోజూ మెట్ల దారిని ఉపయోగించి ఆధ్యాత్మిక అనుభూతిని అనుభవిస్తుంటారు. ప్రతి సంవత్సరం ఈ దివ్యక్షేత్రమందు జరిగే కోరుకొండ తీర్థంలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని జన్మధన్యమైనట్లుగా భావిస్తారు. కొండను చుట్టుకుని కోరుకొండ గ్రామం ఉన్నది. గ్రామంలో ఏ వైపు నుంచి చూసినా దేవాలయం కనబడుతుంది. ప్రకృతి దృశ్యాలను చూసి యాత్రికులు తన్మయత్వం చెందుతారు. దేశంలో ఉన్న అహోబిలం, ఆగిరిపల్లి, మంగళగిరి వంటి నృసింహ క్షేత్రంలాగే ఈ పుణ్యస్థలం యందు కొండలపైన ఉన్న స్వామికి కొండకింద కూడా మరో ఆలయం ఉన్నది. పైన ఉన్న స్వామివారిని దర్శనం చేసుకోవాలంటే ఉదయం 11 గంటలలోపే దర్శనం చేసుకోవలసి ఉంటుంది. ఇక్కడ ఒక విశేషం గమనించవచ్చు. పై గుడిలో నైవేద్యం నివేదన చేసి గంట కొడితేనే కొండ దిగువున ఉన్న స్వామికి నైవేద్యం పెడతారు. దిగువ నరసింహస్వామి వారిని శ్రీరామానుజాచార్యులు వారి శిష్యులు పరాశర భట్టు ప్రతిష్టించారు. నేటికీ పరాశర భట్టు వంశీయులే ఇక్కడ అర్చకత్వం నిర్వహిస్తున్నారు. నారసింహుడు కోరుకొండ గిరిపై కొలువై ఉండుటకు ఒక పురాణ గాథ ప్రచారంలో ఉంది. విశ్వామిత్రుని ఆగ్రహం కారణంగా వశిష్ట మహర్షి తన నూరుగురు కుమారులను కోల్పోయాడు. ఆ దుఃఖముతో వశిష్టుడు ప్రాణ త్యాగం చేయడానికి సిద్ధపడ్డారు. కానీ ఆయన ప్రయత్నాలు పంచభూతాలు అడ్డుకున్నాయి. ఆ సమయాన గర్భ శిశువుగా ఉన్న వశిష్టుని మనవడు పరాశురుడు తాత గారి మనఃస్థితిని అర్థం చేసుకుని నవ్వాడు. దానితో మనవడు మహాప్రభావ సంపూర్ణుడని గ్రహించిన వశిష్ఠుడు అతనికి నారసింహ మంత్రం ఉపదేశించాడు. అటు పిమ్మట పరాశురుడు గోదావరి సమీపంలోని కోరుకొండ గిరిపై నృసింహుని కోసం గొప్ప తపస్సు చేశాడు. దయామయుడైన నృసింహుడు పరాశురుని అభ్యర్థనను అంగీకరించి లక్ష్మీనరసింహస్వామిగా కొండపై కొలువై ఉండి భక్తులను రక్షిస్తున్నాడు. శాంత స్వరూపుడై భక్తుల కోరికలను నెరవేర్చుచున్నాడు. రెడ్డిరాజులు 12వ శతాబ్దంలో స్వామివారి ఆలయాన్ని అభివృద్ధి పరిచారు. ఆలయంలో చెక్కబడిన శిల్పాలు నయనానందకరంగా ఉంటాయి. నాయక రాజులు కూడా ఈ ఆలయ అభివృద్ధికి దోహదపడ్డారు. ఆలయమందు ఐదు రోజులు పాల్గుణ మాసంలో స్వామివారి కళ్యాణ ఉత్సవాలు తిలకించుటకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి కృపకు పాత్రులవుతారు. ఇంకా ఇచ్చట కృష్ణాష్టమి, ఉగాది, ముక్కోటి ఏకాదశి వంటి పర్వదినాలలో విశేష పూజలను నిర్వహిస్తారు. రాజమండ్రి పట్టణానికి 20 కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉన్నది.

# సాధనాలు - ఆశయాలు



డాక్టర్ . చిలకమర్తి దుర్గాప్రసాదరావు

మానవ జీవితంలో రెండు ప్రధానమైన అంశాలు ఉంటాయి . ఒకటి, లక్ష్యం రెండు, ఆ లక్ష్యాన్ని సాధించడానికి మనం ఎన్నుకునే ఉపాయాలు . ఒక్కొక్కప్పుడు లక్ష్యం మంచిదైతే ఆ లక్ష్యాన్ని సాధించడానికి ఎన్నుకునే సాధనాలు అంత మంచివి కాకపోయినా అది పెద్ద దోషం కాదు. ఎందుకంటే లక్ష్యం ముఖ్యం, అది మంచిదే కాబట్టి . ఇక మార్గాలు ఎంత మంచివైనా లక్ష్యం మంచిది కాకపోతే, అది ప్రమాదకరమే. ఇక ఆ రెండూ మంచివే కావడం సర్వోత్తమం . అదే మహాత్ముని మార్గం . ఉదాహరణకి, ఒక పిల్లవాడు స్కూలుకు ఎగనామం పెట్టి సినిమాకు పోతే తండ్రి తన పిల్లవాడిని కఠినంగా దండిస్తాడు. ఇక మేనమామ వాడు ఏడుస్తూంటే చూడలేక, జాలిపడి మరో సినిమా చూసి రమ్మని ఇంకో వంద రూపాయలు జేబులో పెడతాడు అనుకుందాం . ఇక్కడ మామయ్య మంచి,నాన్న చెడ్డ అని ఆ పిల్లవాడు అనుకుంటే చాల పొరబాటు. పరిణామం ఆలోచిస్తే ఎవరు మంచివారో , ఎవరు చెడ్డవారో తెలుస్తుంది . ఒకసారి మన పురాణాలు పరిశీలిద్దాం. మనం పురాణాలు చదివితే దేవతలు ఎంత దారుణమైన, చెత్త పనులు చేశారో మనకు అర్థం ఔతుంది. అవి నోటితో అనలేం, ఎవరైనా చెబితే వినలేం. చేతితో వ్రాయలేం. అలాగే రాక్షసులు ఎంత తీవ్రమైన తపస్సులు, వ్రతాలు చేశారో కూడ మనకు తెలుస్తుంది. ఇక, దేవతలు ఎన్ని చెడ్డ పనులు చేసినా వాళ్ళను, 'దేవతలు' అనే అంటున్నాం. రాక్షసులు ఎన్ని మంచి పనులు చేసినా వారిని, 'రాక్షసులు' అనే అంటున్నాం . ఎందుకు? వాళ్ళు సాధించ దలచుకున్న లక్ష్యాన్ని బట్టి . దేవతలు ఎన్ని చెడ్డ పనులు చేసినా వాళ్ళ లక్ష్యం విశ్వ శాంతి, లోక కల్యాణం, ప్రజా శ్రేయస్సు . రాక్షసులు ఎంత తీవ్రమయిన తపస్సు, వ్రతాలు మొదలైన మంచి పనులు చేసినా వాళ్ళ లక్ష్యం త్రిలోకాధిపత్యం, తద్వారా ఇంద్ర సింహాసనాన్ని దక్కించుకుని,మూడు లోకాలను ఇబ్బందులకు గురి చెయ్యడం. ఇక ప్రస్తుత విషయానికొస్తే మన మాతృదేశ విముక్తికి ప్రాణాలు సహితం లెక్క చేయక పోరాడినటువంటి మహనీయులెందరో ఉన్నారు. వారందరూ చాల గొప్ప వారే, వారిలో ఎటువంటి హెచ్చుతగ్గులు లేవు. కాని ఒకటే తేడా . కొందరు లక్ష్యమే మాకు ముఖ్యమని దాన్ని సాధించడానికి ఒక సాధనాన్ని ఎంచుకున్నారు . ఇక మహాత్ముడు ఒక అడుగు ముందుకు ఆలోచించి లక్ష్యం, సాధనం రెండు కూడ మంచివే కావాలని హెచ్చరించి, అహింసామార్గాన్ని ఎన్నుకున్నారు. విజయం సాధించి, కృతకృత్యులయ్యారు . ఆ విషయాన్నే ప్రస్తావిస్తూ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అంటారు. కార్య సాధనలో ఆయనకు అంటే గాంధీజీకి, means మరియు End రెండు ముఖ్యమే, రెండూ పవిత్రమైనవే కావాలన్నారు. అందుకే ఆయన మార్గం నాకు నచ్చిందని, ఇది ఎంతవరకు సాధ్యమనే విషయంలో నాకు సందేహాలు ఉన్నప్పటికి వారి సిద్ధాంతం , ప్రజా బాహుళ్యంలో బలమైన ముద్ర వేసిందని తన Discovery of India అనే గ్రంథంలో వివరించారు . ఆయన మాటల్లోనే తెలుసుకుందాం . I have been attracted by Gandhiji's stress on right means and I think one of his greatest contributions to our public has been this

emphasis. The idea is by no means new, but this application of an ethical doctrine to large-scale public activity was certainly novel. It is full of difficulty and perhaps ends and means separable but form together one organic whole. In a world which thinks almost exclusively of ends and ignore means, this emphasis on means seems odd and remarkable. How far it has succeeded in India I cannot say but there is no doubt that it has created a deep and abiding impression on the minds of large number of people. ( డిస్కవరీ ఆఫ్ ఇండియా )

ఈ సందర్భంలో మరొక ముఖ్య విషయాన్ని ప్రస్తావిం చు కోవడం ఎంతో అవసరం. ప్రతి దేశంలోనూ ఎన్నో ప్రజాసంఘాలు, సేవాసంస్థలు ఉంటాయి . వాటిలో కొన్ని సంస్థలు ప్రేమ బీజాలు కలిగి ఉంటాయి, మరి-కొన్ని సంస్థలు ద్వేష బీజాలతో ఏర్పడతాయి . ప్రేమ బీజాలతో ఏర్పడే సంస్థల్లో తాత్కాలికంగా కొంతమంది చెడ్డవారున్నా వారు నమ్మిన లేదా ఆమోదించిన విలువలు మంచివి కాబట్టి ఆ సంస్థలు కాలాంతరంలో బాగుపడి ప్రజలకు చక్కని సేవలు అందిస్తాయి. కాని ద్వేషబీజాలతో ఏర్పడిన సంస్థలు తాత్కాలికంగా మంచి వారితో నిండి యున్నప్పటికీ , వారు నమ్మిన సిద్ధాంతాలు ఆమోదించిన విలువలు మంచివి కాకపోవడం వల్ల ఆ సంస్థలు తరువాతకాలంలో దేశానికి ప్రమాదాన్ని తెచ్చి పెడతాయి . కాబట్టి ప్రతివ్యక్తి ఒక సంస్థలో చేరే ముందు ఆ సంస్థ పుట్టు పూర్వోత్తరాలు, ఆశయాలు, ఆదర్శాలు చక్కగా పరిశీలించి ప్రవేశించాలి .

<><><>

## యక్షప్రశ్నలు -భావోద్వేగాల నియంత్రణ

(38 వ పేజీ తరువాయి)

అచేతనులై మరణించి ఉంటే ధర్మరాజు మానసిక స్థితి ఎలా ఉంటుందో ఆలో-చించాలి. ఆ పరిస్థితులలో యక్షుడు అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పాలి. యక్షుని ప్రశ్నలకు ధర్మరాజు చెప్పే సమాధానాలు సరైనవా కావా అన్నది ప్రశ్నకాదు... ని-బ్బరంతో తాను చెప్పిన సమాధానాలకు తనకంటూ ఒక విధానం కలిగి ఉండడమే ముఖ్యం. ఈ విధానాన్ని లేదా సంయమనతను ఈ నాటి యువత సంతరించుకోవా-లి. ముఖ్యంగా పెద్ద పదవిని కాంక్షిస్తూ ఇంటర్వ్యూలకు వెళ్ళే సమయంలో ఏ విధమైన భా-వోద్వేగాలకు లోను కాకుండా నిబ్బరంగా ఉండడం అభ్యాసం చేయాలి, అలవరచుకోవాలి. ధర్మరాజు తాను ఇన్ని రోజులుగా నేర్చిన లేదా అభ్యసించిన విషయాన్ని స్ఫురణకు తెచ్చుకొని, మేధకు పదను పెట్టి, ధారణ చేసి, ప్రతిభాయుత ఆలోచనా పరిధిని పెంచి, యక్షప్రశ్నలకు సమాధానాలిచ్చి ప్ర-జ్ఞావంతునిగా కొనియాడబడ్డాడు. ప్రతిభ అంటే సమర్థత. అది బాహిరమైనది. దానిని Capacity అన-వచ్చేమో... ప్రతిభ ఆంతరంగికమైన ప్రజ్ఞను (Potentiality) జాగృతం చేయాలి. అలా ప్రజ్ఞ జాగృతమై స్ఫురణతో జతకట్టి.. భావోద్వేగాలకు అతీతంగా వెలుగుచూచిన వేళ అద్భుతాలు ఆవిష్కృతమౌతాయి. ధర్మరాజులో ప్రజ్ఞ వికాసం పొంది విస్తరితమయింది.. కాబట్టే.. యక్షుని పరీక్షలో నెగ్గి తమ్ములను రక్షిం-చుకోగలిగాడు.. అజ్ఞాతవాసాన్ని నిర్విఘ్నంగా జరిపేందుకు అవసరమైన వరాలను పొందాడు.

- పాలకుర్తి రామమూర్తి

# అక్షర చరణిలు

ఎలక్ట్రాన్



సాగర్ కృష్ణ ఆఫీసు గదిలో అడుగు పెట్టగానే స్టెనో నందిని వచ్చి,"సర్, ఆర్.ఎస్. లత అనే ఆవిడ పాలనా విభాగంలో ఈ ఉదయం పదింటికి వచ్చి కొత్తగా ఉద్యోగంలో చేరింది. ఏ విభాగాధిపతి వద్ద స్టెనోగా పనిచెయ్యాలో తెలుసుకోవాల్సిందిగా మిమ్మల్ని కలవమన్నారట.

ఆమె వచ్చి నా గదిలో కూర్చుంది. తీసుకురమ్మంటారా?" అని అడిగింది.

“ఆర్.ఎస్. లతా? పేరు విన్నట్టే ఉంది, తీసుకురా,” అన్నాడు సాగర్.

నందిని తన గదిలోకి పోయి, లతతో తిరిగివచ్చింది. ఆమెను కూర్చోబెట్టి వెళ్లిపోబోతుండగా, “ఇక్కడే ఉండు,” అని సాగర్ అనడంతో, నందిని కూడా లత పక్కన కుర్చీలో కూర్చుంది.

సాగర్ లతవైపు చూశాడు. లత చేతులు జోడించి నమస్కారం చేసింది.

“అమ్మా నాన్నలెలా ఉన్నారు?” సాగర్ వెంటనే అడిగాడు.

“నాన్న పోయి ఆరు సంవత్సరాలైంది. మాదకద్రవ్యాల తయారీలో సాక్ష్యాధారాలతో ప్రథమ అనుమానితుడుగా ఋజువై, మా ఆయన పట్టుబడి ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లోనే ఉన్నాడు. పన్నెండేళ్ల కఠిన శిక్ష. అమ్మ నా జీవితాన్ని గురించి బెంగపెట్టుకొని చచ్చిపోయింది.

పరువు గంగపాలై, తోటి ఉద్యోగులతో మాట కరువై, నేను పనిచేస్తున్న మునిసిపల్ ఆఫీసులో ఉద్యోగం మాని, మీ సంస్థ చేసిన ప్రకటనలు చూసి, అప్లై చేసి, ఎంపికైయ్యాను. అమరావతి ఆఫీసులో చేరమని మీ కేంద్రం నుంచి ఉత్తర్వులు వస్తే వచ్చి చేరాను. ఇప్పుడు మిమ్మల్ని చూసేవరకూ ఇక్కడి మీ సంస్థ స్థావరానికి మీరు అధికారి అని తెలియలేదు.”

నందిని తెలివితక్కువది కాదు. లత మాటల్లో ‘తను ఉద్యోగం మారి అమరావతి వచ్చి తప్పుచేశానన్న’ భావన కనబడింది. ఇదేదో ఇంగువగుడ్డ వ్యవహారంలా ఉందనుకొంది. నందిని లోని ఆ సందేహం సహస్రరూపాలు ధరించి ముఖకవళికలు మారకముందే, “రసాయినక విభాగం ముఖర్జీ గారి స్టెనో, తల్లికి అనారోగ్యంగా ఉందని దీర్ఘకాల సెలవు తీసుకొన్నాడు.

మీరాయన స్టెనోగా వ్యవహరించండి. నందినీ, నువ్వీమెను తీసుకు వెళ్ళి, ముఖర్జీ గారి ఛాంబర్ లో దిగబెట్టి, ఆయనకి చెప్పి, వెంటనే తిరిగి రా. చాలా ముఖ్యమైన రెండు ఉత్తరాల్ని డిక్టేట్ చేయాలి. మధ్యాహ్నం విరామసమయంలో ఈమెను నీ సహోద్యోగులతో పరిచయం చెయ్యి.”

****

నందినీ, లతలు గది వీడారు. పావుగంటలో నందిని తిరిగి వచ్చి సాగర్ చెప్పిన ఉత్తరాల్ని హ్రస్వ లిపిలో రాసుకొని గది వీడింది. ప్లాంట్లో ఏదో సాంకేతిక సమస్య వచ్చి సాగర్ వెంటనే అక్కడికి పరుగు తీశాడు. తిరిగి గది చేరేసరికి సాయంత్రం ఆరు దాటింది. ఆఫీసంతా నిర్మానుష్యంగా ఉంది. ఛాంబర్లో ప్రవేశించి కుర్చీలో కూలబడ్డాడు. చల్లటి వాతావరణం హాయి గొల్పింది. బల్లమీది కాయితం బరువుకిందనున్న సంతకాల దస్త్రం తీశాడు. తను చెప్పిన రెండు ఉత్తరాల్నీ చదివి, సంతకాలు చేసి ట్రేలో పడవేసి, దస్త్రం మూయబోతోంటే, తెలుగు అక్షరాలతో టైపు చేయబడిన మూడు కాయితాలు

కనబడ్డాయి.
రెండు పరిచయ వాక్యాలు మొదట్లోనే ఉన్నాయి. "విరామ సమయంలో లత తన గాథ చెప్పుకొని బాధపడింది. మీకో ఉత్తరం డిక్టేట్ చేస్తూ నన్ను టైప్ చేయమంది. అదే కింది ఉత్తరం- నందిని.
"కృష్ణా! ఎంతకాలానికని నిన్ను- చూశాను. గతమంతా ఒక్కసారిగా కనులముందు
కదలాడ సాగింది. ఒకరికొకరు తెలియని మన మొదటి పరిచయం ఎంత గమ్మత్తుగా జరిగిందని?
గుర్తుందా? కార్తీకమాసంలోని ఆఖరి ఆదివారం నువ్వు మీ విద్యార్థుల సమూహంతో, గౌతమీ ఉద్యానవనానికి వన భోజనాలకని వచ్చావు. ఇలాంటి సమూహాలు వచ్చినప్పుడల్లా నేను ఉద్యానవనంలో అటూ ఇటూ తిరుగుతూ ఎవరూ పువ్వులు కోయకుండా, కాయలు రాల్చకుండా, వనంలో చెత్త విసరకుండా చూస్తూ, అలాంటి దృశ్యాలు కంట బడితే హెచ్చరిస్తూ ఉండేదాన్ని. నాకూ ఆ వనానికీ అనుబంధం ఏమిటీ అంటే మా యిల్లు దానికి దగ్గరగా ఉండడమేనని నీకు తెలుసును కదా?. 'చిన్నతనంలో అంటే పర్వాలేదుకాని ఇప్పుడు నువ్వు వయసొచ్చిన పిల్లవు. అనవసరంగా ఇబ్బందుల్లో పడే ప్రమాదముంటుంది.' అని తల్లిదండ్రులు హెచ్చరించినా ఏదో విధంగా నచ్చచెప్పి పోయేదాన్ని.
ఆ రోజు నువ్వు ఉద్యానవనానికి ఓ మూలగా కెమెరా తీసుకొని పక్కనే ప్రవహిస్తున్న గౌతమి ఫోటోలు తీస్తున్నావు. చూసుకోకుండా నీ కెమెరాకీ అడ్డొచ్చిన నన్ను' ఆగండి కదలకండి'
అని గట్టిగా అరిచావు. హడలిపోయి నీ వైపు తిరగడంతో నీ కెమెరాని రెండు మూడు సార్లు క్లిక్ చేసేశావు. 'వండర్ఫుల్, థాంక్ యు' అన్నావు.
'మీరు తీసిన ఫోటో ఎలావచ్చిందో నాకెలా తెలుస్తుంది.?" నేనామాటలెలా అన్నానో నాకే తెలియదు.'

'ఇలాదగ్గరగా రండి, చూపిస్తాను,' అన్నావు నువ్వు.
అడుగులో అడుగు వేసుకొంటూ నిన్ను సమీపించాను. కెమెరా నాచేతికిచ్చి స్క్రీన్ మీద చూడమన్నావు. నిజంగానే అద్భుతంగా ఉంది. ఎర్రటి పట్టుపరికిణీ మీద తెల్లటి వోణి.
గులాబీరంగు జాబ్బా. యవ్వనాన్ని సూచించే లోపొంగుల్ని జాబ్బావోణీలు అపలేకపోతున్నాయి.
నీ మాటల్లోనే చెప్పాలంటే 'భీతహరిణిలా, బాపు బొమ్మలా ఉన్నార'న్నావు. సిగ్గేసి, కనులు మూసుకొని కెమెరా అందివ్వబోతూంటే నువ్వునన్ను జబ్బపట్టుకొని లాగావు. ఆ ఊపులో అదుపుతప్పి నీ ఎదమీద వాలాను. నన్ను నెమ్మదిగా తిప్పి నేలమీద చూపించేవు. ఓ పెద్ద ఎర్రతేలు పచ్చటి లాన్ మీద వయ్యారంగా నడుచుకొంటూ పోతోంది.
'క్షమించాలి. అది మీ కాలిపక్కనుంచి దగ్గరగా పోతోంది. మిమ్మల్ని కుడ్తుందేమోనన్న భయంతో మీ జబ్బపట్టుకొని లాగాను. ఏమీ అనుకోవద్దు,' అన్నావు.
ఏమని సమాధానం చెప్పను? ఆ స్పర్శలోని అనుభవాన్ని వర్ణించడానికి నాకు మాటలు లేవు. వచ్చినా అపరిచితుడవైన నీతో ఎలా చెప్పగలనని? నరనరాల్లో ఏదో విద్యుత్ ప్రవహించి మనసు పులకించిపోయింది. మెదడు మొద్దెక్కిపోయింది. హృదయం క్షణకాలం స్తంభించి పోయింది. కొద్ది క్షణాలలోనే నన్ను నేను నిగ్రహించుకొని, నీ నుండి విడివడి 'పర్వాలేదులెండి.
తేలు కుడ్తే ఇంకేమైనా ఉందా?' అన్నాను. మదనుడెలా ఉంటాడో ఊహించలేను కానీ అతగాడే నీలా ఉంటాడనిపించింది ఆ సమయంలో. కనురెప్పలు మూయకుండా నీవైపే చూస్తూ ఉండిపోయాను. చాలామంది మన వైపే వస్తున్న అలికిడి విని, 'నేను వచ్చే ఆదివారం రోజున సాయంకాలం నాలుగింటికి వస్తాను,' అంటూ కెమెరా తీసుకొని, నది గట్టునుంచి కిందకి పోయే మెట్లమీదనుంచి దిగిపోయావు. ఆ మాట నాలో ఎన్ని ప్రకంపనల్ని రేకెత్తించిందని? వేణువునుంచి వెలువడిన

సుమధుర గీతపు తరంగాలు నన్ను నిలువెత్తునా ముంచేశాయనిపించింది. మావిచిగురుల చాటున దాగిన కోయిల కుహుకుహు రాగంలా వినిపించింది. ఎన్ని భావోద్రేకపు తలపులని? ఆ వచ్చే ఆదివారం వరకూ కలలు కందామని, కలల్లో నువ్వు నీ బిగి కౌగిలిలో నన్ను బంధిస్తావని ఎంతో ఆశించినా, కనురెప్పలు మూయలేక ఎంతగా సతమత మయ్యానో నీకెలాచెప్పేది? హేమంతం నుంచి ఒక్కసారిగా గ్రీష్మంలో అడుగు పెట్టినట్లనిపించింది. దీర్ఘకాలపు ప్రేమికురాలిగా ఎంతటి విరహవేదన అనుభవించానో ఊహించగలవా కృష్ణా? మదనతాపమంటే అదేనేమో?

అ మరుచటి ఆదివారం బయలుదేరి మూడింటికే గౌతమీ ఉద్యానవనం చేరుకొన్నాను. నువ్వూ ఆ పాటికే వచ్చి పారిజాతం చెట్టుకింద పచార్లు చేస్తున్నావు! నా ఆనందానికి హద్దులు లేకపోయాయి. పరుగున వచ్చి, నీ చెంత బ్రేకులు వేసిన బండిలా నిలబడిపోయాను. అప్పుడే నేను నిన్ను కృష్ణా అని పేరుతో పిలిచాను. అటుతర్వాత ఎన్నో ఆదివారాలు కలిసి ఎన్నెన్ని ఊసులాడుకొన్నామని? అయితే సంప్రదాయపు హద్దులూ, ఇంగితజ్ఞానమూ నిన్నూ, నన్నూ కూడా హద్దులుదాటని కట్టడిలో ఉంచాయి.

ఓ ఆదివారం నీ అక్కా,బావల్ని పార్కుకి తీసుకొచ్చి పరిచయం చేసావు. ఆమె నాతో ఎంతో స్నేహపూర్వకంగా ప్రవర్తించి, నా మనసుకూడా తెలుసుకొంది.

“ఇల్లు చాలా దగ్గరన్నావు కదా? పద, ఇప్పుడే పోయి నీ తల్లిదండ్రులతో మాట్లాడి నిశ్చయం చేసేసుకొందాం,”అని నీ అక్కగారనడంతో సిమ్మెంటు బెంచీమీదనుంచి లేచాను.

ఊహించని ఆ హఠాత్పరిణామానికి చెప్పొద్దూ, గుండె దడదడలాడింది. అందరూ మాయిల్లు చేరిన తర్వాత నీ బావగారు నా తండ్రితోనూ, అక్కయ్య గారు నా తల్లితోనూ దూరంగా తీసుకుపోయి మాట్లాడారు కదా? ఆఖరిబంతిలో ఆరు కొట్టి, ఆటని ధోనీ గట్టెక్కిస్తాడా లేదా అన్నంత ఉత్కంఠతతో ఇద్దరం బిగిసిపోయి కూర్చున్నాం, గుర్తుందా? నీ అక్కా బావలు గంభీరవదనంతో హాల్లోకి వచ్చి నిల్చున్నారు.

‘కృష్ణా! లత నాన్నగారు తన నలుగురు స్నేహితుల తరపున బ్యాంక్ వారికి పూచీకత్తుగా నిలబడ్డారట? వారు బాకీలు ఎగ్గొట్టడంతో కోటిరూపాయలు భారం ఆయనమీద పడిందట. జైలుకు వెళ్లాల్సిన సమయంలో, ఆయన సోదరి భర్త ఆ పూచీకత్తును చెల్లించి, లతని ఆయన కుమారునికిచ్చి వివాహం చేయాలని పెట్టిన షరతుకి అంగీకరించాడట,’ అన్నారు నీ బావగారు. ఈ విషయం నాకు కానీ, అమ్మకి కానీ తెలియదు. నాన్న నిస్సహాయపరిస్థితిలో చేసిన వాగ్దానాన్ని భంగం చేసే పరిస్థితి కలిగించడానికి నాకు మనసొప్పలేదు. ఆ మాటే మీ అందరిముందూ చెప్పి, ఓ నమస్కారం పెట్టి లోపలికి పరుగు తీశాను.

’తర్వాత మనసు రాయిచేసుకొని, ఎల్లవేళలా మనజీవితం మనది కాదని సమాధానపడిపోయాను. బి.ఏ. అవగానే స్టెనోగ్రఫీ నేర్చుకొని రాజమండ్రీ మునిసిపల్ ఆఫీసులో చేరాను.

నాకిప్పుడు కొడుకూ, కూతురూ. ఆరు, ఏడు తరగతుల్లో ఉన్నారు. వారం రోజులక్రితం ఈ ఊరు వచ్చి, ఓ స్నేహితురాలి సహాయంతో చిన్న వాటా అద్దెకు తీసుకొని అందులో దిగాను.

ఆమె సహాయంతోనే నా పిల్లల్ని రెండురోజులక్రితమే ఇక్కడి స్కూళ్ళలో చేర్పించాను. ఇక్కణ్ణుంచి నేను వెంటనే బదిలీ కోరలేను, అలాగని నువ్వు ఎదురుగా ఉంటే గతజీవితపు మధురక్షణాలు మాటిమాటికీ గుర్తొచ్చి బాధపడ్డం తప్ప మరేమీ ఉండదు. అది విపరీత పరిణామాలకి దారి తీయొచ్చు. ఎందుకంటే నలభైయ్యో పడిని అందుకోబోయే నీకింకా వివాహం కాలేదని నందిని చెబ్తోంది.

‘అన్నట్టు మరో మాట. నందిని కూడా అవివాహితే! ఆమెకూడా ముప్పైదాటి మూడు సంవత్స-

రాలైంది. ఆమె నిన్ను గాఢంగా ప్రేమిస్తోంది. కానీ వ్యక్తం చేయలేకపోతోందట. మీరిద్దరూ దంపతులైతే నేను నిశ్చింతగా ఉండగలను' ....శ్రీలత.

'గమ్మత్తుగా ఉందే! శ్రీలత తమ భగ్నప్రేమను గుర్తు చేస్తోనే, మరెవరో నిన్ను ప్రేమిస్తున్నారు, ఆమెను వివాహం చేసుకోమన్న సందేశమా?' అనుకొంటూ సాగర్ ఆ ఉత్తరాన్ని మరోమారు చదివి ఆలోచనలో పడ్డాడు.

ఆఖరి మూడు వాక్యాలను హైలైట్ చేసి, చివర్లో తన కలంతో ఓ ప్రశ్నార్థకం పెట్టి దస్త్రం మూశాడు. మర్నాడుదయం నందిని ముందుగా వచ్చి దస్త్రం తెరిచి చూసింది. ప్రశ్నార్థకం చూసి గుండె దడదడలాడింది. ఆ మూడుకాయితాల్ని ఆత్రంగా తీసుకొని తనగదిలోకి పోయింది. సాగర్ వచ్చిన తర్వాత అతని ఎదుట ఏమని మాట్లాడాలా అన్న ఆలోచనలో పడిపోయింది.

సాగర్ ఆ దినం ఉదయం నేరుగా సైట్ కి పోయి, గత దినం తలెత్తిన సాంకేతిక సమస్య పరిష్కారం జరిగినా, మరికొన్ని మార్పులను దగ్గరుండి చేయించి, మధ్యాహ్నానికి ఆఫీసు చేరుకొన్నాడు.

వెంటనే ఉత్సుకతో సంతకాల దస్త్రం తెరిచి చూశాడు. గతస్మృతులతో నందిని ద్వారా లత పంపిన లేఖ కనబడలేదు. నందిని గదిలోకి రాగానే ఎలా స్పందించాలా అన్న ఆలోచనలో పడిపోయాడు.

నందిని గదిలో ప్రవేశించి, "సర్! మీరు పెట్టిన ప్రశ్నకు సమాధానమివ్వలేగా? ఈ సాయంత్రం దుర్గమ్మ పార్కుకి అమ్మా నాన్నలతో సహా వెడ్తున్నాను. జలయంత్రం వద్ద సిమ్మెంటు బెంచీ మీద కూర్చుని కబుర్లు చెబుతూ ఉంటాం," అని వెంటనే వెళ్లిపోయింది. ఆ రోజిక సాగర్ నందినిని పిలిచి ఏ లేఖలూ చెప్పలేదు.

సాగర్ మథనలో పడ్డాడు. నందిని పిసరంత బొద్దుగా కనిపించినా కనుముక్కు తీరువలు కలిగినది. అవయవ సంపదగల మనిషి. ఎన్నిసార్లు నందిని తనలో కోర్కెలను రెచ్చగొట్టిందని. అయినా నిగ్రహించుకొన్నాడు. శ్రీలత ఆలోచనలు తనని అలాంటి కోర్కెలనుంచి దారి మళ్లించేవి. ఏమాశించి? ఓ భగ్నప్రేమికుడి ముద్ర వేయించుకొని తన నిజాయితీని ఆత్మకథలో రాసుకోవాలనా? శ్రీలత ఇప్పుడు ఇద్దరుబిడ్డల తల్లి. భర్త జైల్లో ఉన్నా ఎప్పుడో అప్పుడు విడుదలై వస్తాడు. మనసు ఒక్కసారిగా నందిని వైపు మొగ్గు చూపింది. దుర్గమ్మ పార్కుకి వెళ్ళాడు. ఎదురు చూస్తున్న నందిని మొహం సాయంత్రపుటెండలో కృష్ణాజలాల వలె మిలమిలా మెరిసింది. నందిని తండ్రి కరచాలనం చేసి, సాగర్ ని తన పక్కన కూర్చోబెట్టుకొన్నాడు.

"అమ్మాయి సంగతి చెప్పింది. చాలా సంతోషం. శుభస్య శీఘ్రం అన్నారు పెద్దలు. మీ పెద్దవారి నెవర్నైనా తీసుకువస్తే, వారి ఆమోదం కూడా తీసుకొంటే సంప్రదాయం పాటించినట్లవుతుంది." అన్నాడాయన.

"నాకు మా అక్కా, బావా తప్ప పెద్దవారెవరూ లేరు. మా బావగారికి కోలకతాలో ఉద్యోగం. ఫోన్ చేసి పిలుస్తాను. వాళ్లురాగానే వచ్చి కలుస్తాను." అన్నాడు సాగర్.

సాగర్ అందరికీ ఐస్ క్రీమ్ తినిపించాడు. అందరూ లేచి వెడ్తూన్నప్పుడు అదును చూసుకొని నందిని నడుమ్మీద చేయివేసి నొక్కాడు. కళ్ళతో వారిస్తూ నందిని దూరంగా జరిగింది.

ఆ వారంలోనే నందిని ముందస్తుగా ఉద్యోగానికి రాజీనామా చేసేసింది. మరో వారంలో నందినీ సాగర్ కృష్ణల వివాహం జరిగిపోయింది. ఆఫీసంతా చెవులు కొరుక్కుంటూ విస్తుబోయినా, సాగర్ ఓ ఇంటివాడైనందుకు సంతసించింది. మరో వారంలోగా ఊహించని విధంగా సాగర్ కి బెంగళూరు బదిలీ అయిపోయింది. ఆ బదిలీ వెనక నందిని హస్తం ఉందని సాగర్ కి తెలియదు.

నందిని దృక్పథంలో కారణాలనేకమని వేరే చెప్పనవసరం లేదు. శ్రీలత ఏదో కోల్పోయినట్లుగా, మరేదో భారం తొలిగి పోయినట్టుగా ఓ నిట్టూర్పు విడిచింది.

****

# ఓ మహిళా ! నీకు జేజేలు

శ్రీమతి వి. నిర్మల

స్త్రీ ఒక అందమైన అద్భుతం -- అర్థం చేసుకుంటే మహాద్భుతం
స్త్రీ ఒక ప్రచండ శక్తి --- గౌరవిస్తే ఒక యుక్తి
స్త్రీ ఒక అనురాగ దేవత --- ఆగ్రహిస్తే వధించే కాళీమాత
స్త్రీ అందాలకు ఊపిరి ---- అనుబంధాలకు రహదారి
స్త్రీ నేర్పుకి నిజరూపం ---- ఓర్పుకి ప్రతిరూపం
స్త్రీ ఇంటికి సిరిసంపదలు ---- మగవాని మోమున చిరునవ్వు
స్త్రీ గృహానికి ఆర్థిక విశ్లేషణ --- సమస్య వస్తే పరిష్కార క్షిపణి
స్త్రీ కుటుంబానికి హృదయం --- మమతానురాగాలు నిలయం
స్త్రీ వంశవృక్షానికి ఆధారం --- స్త్రీని కోల్పోతే జీవితం దుర్లభం
స్త్రీ ఒక అలుపెరుగని యంత్రం --- అందరూ జపించవలసిన గాయత్రీ మంత్రం
స్త్రీ లేనిదే గడవదు ఓ పూట --- తెలుసుకోవాలి ఈ మాట

ఆమెనీ పూజించు. సోదరిని దీవించు. భార్యని ప్రేమించు. మహిళలనందరిని గౌరవించు.

మహిలో మహిళ ఓరిమికి భూమాత
ఆకలికి అన్నపూర్ణ
పని బిడ్డకు తన మేను పట్టు పానుపు జేసి
ఉద్యోగంలో ఉన్నతం
సరుకులను తేవడం, బట్టలుతికి శుభ్రంగా ఇస్త్రీ పెట్టెను పట్టి
చరవాణిలో అడిగిన ప్రశ్నలకు ఓరిమితో సమాధానపరచి
యాంత్రికమైన నవనాగరికతతో
ముఖంలో ముత్యమంతా విసుగు కనిపించని
సవ్యసాచి మహిళలేని మహిలేదు
కార్యేషు దాసీ కరణేషు మంత్రి
ఇలా అన్నిటా నీవే -- సమస్తమూ నీవే -- అందుకే ఓ మాతృ మూర్తి
అవనిపై అద్భుతం ఆమె -- ప్రకృతి రూపం ఆమె
అందానికి ప్రతి రూపం ఆమె -- సృష్టికి మూలం ఆమె
అమ్మగా, చెల్లిగా, భార్యగా అన్ని పాత్రలూ పోషిస్తూ ... ఆదర్శంగా నిలుస్తుంది ఆమె
సెలవు లేకుండా ప్రేమించే నిరంతర శక్తి ఆమె. నిత్యం కుటుంబం కోసం ఆలోచించే ఏకైక వ్యక్తి
మహిళా సాధికారతకు పాటు పడదాం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు


గాజా యుద్ధ విధ్వంసం


అమెరికన్ థాడ్
డిఫెన్స్ వ్యవస్థను ధ్వంసం చేసిన
ఇరాన్

RNI No. TELTEL/2011/39497 MARCH 2026 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st March Date of Posting:8th March




Published, Edited and Printed by T Shanti at Flat No. 504, Tower A06, Rajiv Sahabhavana Nagole-Bandlaguda, Hyderabad-500068. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.